సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 09.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 339
పేజీలు: 08 వెల: రూ. 5

# నింగికెగిసిన నటశిఖరం

గుండెపోటుతో గోవాలో నానా పటేకర్ కన్నుమూత



- మూడు జాతీయ అవార్డులు అందుకున్న విలక్షణ నటుడు
- 'నటసామ్రాట్'కు ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారం
- పవన్ సహా పలువురు ప్రముఖుల సంతాపం

02

# మూడోరోజూ ఉద్రిక్తత

## విపక్షాల ఆందోళనలతో ఢిల్లీలో ఉద్రిక్తత సీఈసీ రాజీనామాకు డిమాండ్

- మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్ కుట్ర చేస్తున్నారంటూ రాహుల్ ఆరోపణలు
- ఓట్ చోరీపై కేంద్రం సమాధానం చెప్పాలన్న రాహుల్
- పోలీసుల తీరుపై ఆగ్రహం
- రహదారులు మూసివేసిన పోలీసులు
- జంతర్‌మంతర్ ఘటనల తర్వాత మళ్లీ నిరసనలకు సిద్ధమైన ఇండియా కూటమి ఎంపీలు



**ముద్ర, న్యూ ఢిల్లీ:** ఢిల్లీలో మళ్లీ హైటెన్షన్ నెలకొంది. మరోసారి విపక్షాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. రాజ్‌ఘాట్‌కు చేరుకున్న విపక్ష ఎంపీలు.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా వరుసగా మూడోరోజు ఆందోళనలు చేపట్టారు. కాసేపట్లో రాజ్‌ఘాట్‌కు చేరుకోనున్న విపక్ష ఎంపీలు.. అక్కడ ఆందోళన చేయనున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

**కుట్ర పన్నుతున్నారు: రాహుల్**

మేం శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు మాపై దాడి చేశారంటూ రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఓట్ చోరీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్ కుట్ర పన్నుతున్నారు. ఓట్ చోరీపై కేంద్రం సమాధానం చెప్పాల్సిందే. ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. నిన్న మాపై దాడులు చేశారు" అంటూ రాహుల్ ధ్వజమెత్తారు. మిగతా 02లో



## వారసుడి నుంచి యోధుడిగా!

అధికారం దక్కకపోయినా.. పట్టు పెంచుకున్న నేత రాహుల్ గాంధీ

- ఓటములు నేర్పిన పాఠాలతో కొత్త వ్యూహం..
- ప్రజల మధ్యే రాజకీయ ప్రయాణం
- పాదయాత్రలతో మారిన ఇమేజ్..
- ప్రతిపక్ష నేతగా పెరిగిన ప్రాధాన్యం
- ఇక అసలు లక్ష్యం ఒక్కటే.. ప్రధాని పీఠం!

రోడ్డెక్కి సామాన్యుడిలా ఆందోళన చేస్తూ ప్రజలకు చేరువ

**ముద్ర, న్యూఢిల్లీ:** గాంధీ–నెహ్రూ కుటుంబం పేరు చెప్పగానే దేశ రాజకీయాల్లో అధికారం, నాయకత్వం, ప్రధానమంత్రి పదవే గుర్తుకొస్తాయి. కానీ ఆ కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ రాజకీయ ప్రయాణం మాత్రం అందుకు పూర్తి భిన్నం. వారసత్వంగా వచ్చిన పేరు ఉన్నా.. ఆ పేరుతో అధికారం మాత్రం దక్కలేదు. వరుస పరాజయాలు, విమర్శలు, పార్టీ పతనం.. అన్నింటినీ ఎదుర్కొంటూ రాహుల్ తన రాజకీయ శైలినే మార్చుకున్నారు. ఇప్పుడు ఆయనను కేవలం గాంధీ కుటుంబ వారసుడిగా కాకుండా.. పోరాటంతో తన స్థానాన్ని నిర్మించుకుంటున్న నాయకుడిగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఓటమి.. మార్పుకు నాంది**

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సమయంలో రాహుల్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. గాంధీ కుటుంబ వారసత్వం, యువ నాయకుడి ఇమేజ్, కాంగ్రెస్ పార్టీ మద్దతు.. ఇవన్నీ ఆయనకు అనుకూలంగా కనిపించాయి. కానీ ఎన్నికల ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. కాంగ్రెస్ వరుసగా బలహీనపడటం, సొంత నియోజకవర్గంలోనూ ఎదురైన సవాళ్లు రాహుల్ రాజకీయ శైలిపై ప్రశ్నలు లేవనెత్తాయి. అయితే అదే దశ రాహుల్ రాజకీయ పరివర్తనకు కారణమైంది. సభలు, మీడియా సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

**వీధుల్లోకి వచ్చిన నాయకుడు**

రాహుల్ రాజకీయ ప్రయాణంలో పాదయాత్రలు కీలక మలుపుగా మారాయి. భారత్ జోడో యాత్రతో వేల కిలోమీటర్లు నడుస్తూ సామాన్యులను కలిశారు. ఆ తర్వాత భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా మరిన్ని ప్రాంతాలను చుట్టివచ్చారు. ఈ యాత్రలు కేవలం కాంగ్రెస్ కార్యక్రమాలుగా కాకుండా.. రాహుల్ వ్యక్తిగత రాజకీయ ఇమేజ్‌ను మార్చిన ప్రయత్నాలుగా నిలిచాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.

**వారసత్వం కంటే పోరాటమే!**

నెహ్రూ నుంచి రాజీవ్‌గాంధీ వరకు అధికారం గాంధీ కుటుంబానికి దాదాపు సహజ పరిణామంలా కనిపించింది. రాహుల్ విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నం. ఆయనకు వారసత్వం ఉన్నా.. రాజకీయ విజయాన్ని మాత్రం ప్రతి దశలోనూ పోరాడి సాధించాల్సి వచ్చింది. ఇదే ఇప్పుడు ఆయన రాజకీయ ఇమేజ్‌లో ప్రధాన మార్పుగా కనిపిస్తోంది. 'గాంధీ కుటుంబ వారసుడు' మిగతా 02లో

## సేవ్ డెమోక్రసీ

హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు
- పోలీసులతో నేతలకు తీవ్ర వాగ్వాదం
- పొన్నం, మహేశ్ గౌడ్ మంత్రులు, నేతల అరెస్ట్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్ భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మా రింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ మిగతా 02లో

## పడిపోయిన బొగ్గు ఉత్పత్తి

- తుగ్లక్ నిర్ణయాలతో అంటూ హరీశ్ ఆగ్రహం
- 14న రామగుండంలో సింగరేణి కార్మిక గర్జన సభ
- ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్



03

## ఓటు కోసం 4,88,417 మంది దరఖాస్తు

- ఓటు తొలగింపునకు 24,323 ఫామ్-7లు
- హైదరాబాద్‌లో 6,335 ఫామ్-7లు
- ముషీరాబాద్‌లో 87 ఓట్లు తొలగింపు
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా

02

# రేవంత్‌పై కేటీఆర్ మైండ్ గేమ్

## రేవంత్‌పై ఫిర్యాదులు.. రాహుల్‌నే టార్గెట్ చేస్తున్న కేటీఆర్?

- చర్యలు రావని తెలిసినా వరుస లేఖలు..
- సీఎం కంటే కాంగ్రెస్ ఇమేజ్‌పైనే గురి?
- రాహుల్ సిద్ధాంతాలనే ప్రశ్నిస్తున్న కేటీఆర్
- తెలంగాణ రాజకీయాలను ఢిల్లీకి తీసుకెళ్లే వ్యూహం
- రేవంత్ ద్వారా రాహుల్‌ను ఇరుకున పెట్టే ప్లాన్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కొత్త తరహా వ్యూహాన్ని అమలు చేస్తోందా? సీఎం రేవంత్‌రెడ్డిపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఫిర్యాదులు చేయడం వెనుక అసలు లక్ష్యం ఏమిటన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థి పార్టీ నేత ఫిర్యాదు చేశారని రాహుల్ గాంధీ నేరుగా రేవంత్‌పై చర్యలు తీసుకునే అవకాశం లేదన్న విషయం బీఆర్ఎస్‌కు కూడా తెలుసు. అయినప్పటికీ కేటీఆర్ అదే అంశాన్ని పదేపదే తెరపైకి తీసుకురావడం వెనుక వ్యూహాత్మక రాజకీయమే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిగతా 02లో



03

## గోదావరి-కావేరి అనుసంధానంతో అద్భుత ఫలితాలు

కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్

- గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి
- ప్రధానితో భేటీలో సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు
- 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం

## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు భారీ మద్దతు

ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ 42 మంది మాజీ న్యాయమూర్తుల లేఖ..




- ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థలను దెబ్బతీసేలా ప్రచారం చేస్తున్నారని మండిపాటు

02

## వన్‌వేతో ట్రాఫిక్ తగ్గిందా?



- వందల కోట్ల ప్రాజెక్టులపై పునరాలోచన
- ప్రజాధనం వృథాపై విమర్శలు
- భవిష్యత్ ట్రాఫిక్‌కు వన్ వే సరిపోతుందా?
- కేబీఆర్ చుట్టూ శాశ్వత పరిష్కారం ఏది?

02

**ఇదీ AI ముద్ర**

చలికాలం చేరువ అవుతున్నా ఎల్‌నినో ఎఫెక్ట్ తో తెలంగాణలో ఎండల తీవ్రత తగ్గడం లేదు. వేసవిని తలపిస్తూ దారెత్తిస్తోంది



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం,
09 అక్టోబర్, 2026



**పల్లీలతో గొంతు సమస్యలు రావొచ్చు**

పల్లీలు తిన్న వెంటనే చల్లటి నీరు తాగితే కొందరిలో గొంతు మంట, దగ్గు, జలుబు వంటి అసౌకర్యాలు కనిపించ వచ్చని చెబుతున్నారు.



# మూడోరోజు ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

**ఢిల్లీ రైల్వే స్టేషన్ రోడ్లు మూసివేత**

ఇండియా కూటమి నేతల నిరసనలతో ఢిల్లీ రైల్వే స్టేషన్ రోడ్లను పోలీసులు మూసి వేశారు. రైల్వే స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కన్నాట్ ప్లేస్ రోడ్‌లో గంటల కొద్దీ భారీ ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**మూడో రోజు కూడా..**

'సీఈసీ రాజీనామా డిమాండ్' ఉద్యమం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. మూడో రోజు 'సీఈసీ రాజీనామా డిమాండ్' ఉద్యమాగ్ని మరింత రగులుతోంది. మొన్న (మంగళవారం) ద్యంతం ఉద్రిక్తంగా కొనసాగిన ఉద్యమంలో స్వయంగా పాల్గొని, నినదించి, అరెస్టయిన మిత్రపక్షాల ఎంపీలను అభినందిస్తూ కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే ఇచ్చిన మధ్యాహ్న విందు కాస్తా అనూహ్యంగా జంతర్‌మంతర్ ధర్నాస్థలికి ర్యాలీగా మారడం, మధ్యలోనే పోలీసులు అడ్డుకుని ఎంపీలను బస్సుల నుంచి దించేయడం, ఎంపీలు అక్కడే బైఠాయించి ధర్నాకు దిగడం, పోలీసులు, ఎంపీల మధ్య వాగ్వాదం, తోపులాట, బలవంతంగా అరెస్టులతో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఉద్యమం నాటకీయ పరిణామాల మధ్య కొనసాగిన సంగతి తెలిసిందే. ఇవాళ కూడా విపక్ష ఎంపీలు ఆందోళనలకు సిద్ధమయ్యారు.

# సేవ్ డెమోక్రసీ

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది. మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

# వన్ వేతో ట్రాఫిక్ తగ్గిందా?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లో కీలకమైన కేబీఆర్ జాతీయ పార్క్ చుట్టూ జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై చర్చ మొదలైంది. H-CITI ప్రాజెక్టులో భాగంగా వందల కోట్ల అంచనా వ్యయంతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొం



దించారు. ఈ పనుల నేపథ్యంలో ఆగస్టులో పార్క్ చుట్టూ 'రౌండ్ ది పార్క్' వన్ వే విధానాన్ని ట్రాఫిక్ పోలీసులు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. వన్ వే అమలుతో ట్రాఫిక్ రద్దీ కొంత తగ్గడంతో గతంలో ప్రతిపాదించిన కొన్ని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో ముందస్తు అధ్యయనాలు లేకుండానే వందల కోట్ల ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే రోడ్ల తవ్వకాలు, చెట్ల తొలగింపు, ఇతర పనులకు చేసిన వ్యయం కూడా వృథా అయ్యే అవకాశం ఉందని విమర్శలు వస్తున్నాయి.

**భవిష్యత్ అవసరాలకు సరిపోతుందా?**

వన్ వే వల్ల ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ కదలిక మెరుగుపడుతున్నప్పటికీ, చిన్న దూరాలకు కూడా వాహనదారులు చుట్టూ తిరగాల్సి రావడంతో అదనపు సమయం, ఇంధనం ఖర్చవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూటర్న్ల వద్ద కొత్తగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని కొందరు వాహనదారులు చెబుతున్నారు. ప్రస్తుతం వన్ వే కొంత ఉపశమనం కలిగించినా, పెరుగుతున్న వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని 5–10 ఏళ్ల భవిష్యత్ అవసరాలపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని రవాణా నిపుణుల అభిప్రాయం. తాత్కాలిక ట్రాఫిక్ నిర్వహణతో పాటు పర్యావరణాన్ని కాపాడుతూ దీర్ఘకాలిక మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందనే చర్చ సాగుతోంది.

# వారసుడి నుంచి యోధుడిగా!




(మొదటి పేజీ తరువాయి)

అనే గుర్తింపును దాటి 'ప్రతిపక్ష స్వరం'గా ఎదగాలన్న ప్రయత్నం రాహుల్ రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పదేళ్ల తర్వాత వచ్చిన గుర్తింపు లోక్‌సభలో పదేళ్ల తర్వాత ప్రతిపక్ష నేతకు అధికారిక హోదా లభించడం రాహుల్ రాజకీయ ప్రస్థానంలో మరో కీలక ఘట్టం. ఈ హోదాతో ఆయనకు పార్లమెంటులో మరింత కీలక పాత్ర లభించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, ప్రతిపక్షాన్ని సమన్వయం చేయడం వంటి బాధ్యతలు ఆయన భుజాలపై పడ్డాయి.

**ఇక ముందున్న అసలు పరీక్ష**

రాహుల్‌గాంధీకి ఇప్పటికీ ప్రయాణం పూర్తి కాలేదు. కాంగ్రెస్‌ను దేశ వ్యాప్తంగా పునర్నిర్మించడం, యువతలో నమ్మకం పెంచడం, ప్రతిపక్ష కూటమిని బలోపేతం చేయడం, బీజేపీకి ప్రత్యామ్నాయంగా ప్రజల ముందు నిలవడం ఆయనకు అతిపెద్ద సవాళ్లు. అందుకే రాహుల్ రాజకీయ కథను కేవలం 'గాంధీ కుటుంబం నుంచి వచ్చిన మరో వారసుడు'గా చూడటం సరిపోదు. ఓటముల నుంచి నేర్చుకుని.. ప్రజల్లోకి వెళ్లి.. పోరాటాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకున్న నాయకుడిగా ఆయన కొత్త అధ్యాయాన్ని రాస్తున్నారు. వారసత్వం ఆయనకు పేరు ఇచ్చింది.. కానీ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది మాత్రం ఆయన పోరాటమే.

# రేవంత్ పై కేటీఆర్ మైండ్ గేమ్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌ను ఇరుకున పెట్టడం కంటే.. రాహుల్‌ను ప్రశ్నించే వేదికను సృష్టించడమే కేటీఆర్ లక్ష్యమా? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాల హక్కులు, వ్యక్తి స్వేచ్ఛ వంటి అంశాలపై గళమెత్తుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలు, ప్రతిపక్ష నేతలపై కేసులు, అరెస్టుల విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు.

**'మీ సిద్ధాంతం.. మీ సీఎంకు వర్తించదా?'**

కేటీఆర్ వ్యూహంలో అసలు పంచ్ ఇదేనని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో మాట్లాడే సిద్ధాంతాలను తెలంగాణ పరిణామాలతో ముడిపెట్టి.. 'కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు ఎలా అమలవుతున్నాయి?' అనే ప్రశ్నను జాతీయ చర్చగా మార్చే ప్రయత్నం జరుగుతోందని చెబుతున్నారు. రాహుల్ స్పందించినా బీఆర్ఎస్‌కు రాజకీయ అంశమే. స్పందించకపోయినా మరో రాజకీయ అంశమే. స్పందిస్తే రేవంత్ ప్రభుత్వంపై అధిష్ఠానం దృష్టి పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది. స్పందించకపోతే రేవంత్ చర్యలకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం మద్దతు ఉందనే ప్రచారం చేసుకునే అవకాశం బీఆర్ఎస్‌కు లభిస్తుంది.

**కాంగ్రెస్ 'నైతికత'పై యుద్ధం**

ఇదే కేటీఆర్ లేఖల వ్యూహంలో కీలకమైన మలుపుగా రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ పోరాటం ప్రధానంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్రీకృతమైంది. ఇప్పుడు అదే విమర్శలను కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో అనుసంధానించడం ద్వారా పోరాట పరిధిని విస్తరించే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రంలో ఒక సీఎం తీసుకునే నిర్ణయానికి ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకత్వాన్ని జవాబుదారీ చేయడం ద్వారా రేవంత్ ప్రభుత్వంపై విమర్శలను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలతో ఢీకొట్టడం కేటీఆర్ వ్యూహంగా కనిపిస్తోంది.

**ఢిల్లీకి చేరుతున్న తెలంగాణ రాజకీయ వేడి**

కేటీఆర్ రాహుల్‌గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ లేఖలు, పోస్టులు చేయడం మరో ప్రయోజనాన్ని కూడా ఇస్తోంది. తెలంగాణలోని వివాదాలను ఢిల్లీ రాజకీయ వర్గాలు, జాతీయ మీడియా దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తోంది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలకు జాతీయ స్థాయిలో ప్రచారం దక్కుతోంది. అంటే.. ఒక లేఖ.. రెండు రాజకీయ లక్ష్యాలు. రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శించడం ఒకటి కాగా, కాంగ్రెస్ జాతీయ నాయకత్వాన్ని కూడా రక్షణాత్మక స్థితిలోకి నెట్టడం రెండోది.

**'డ్యామేజ్' చేయడమే అసలు లెక్క?**

ఇక కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపైనా ఈ వ్యూహం ప్రభావం చూపుతుందని బీఆర్ఎస్ అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. రేవంత్‌పై ఢిల్లీ పెద్దలకు వరుస ఫిర్యాదులు వెళ్లడం వల్ల ముఖ్యమంత్రి నిర్ణయాలపై పార్టీ అంతర్గతంగా చర్చ పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రేవంత్ వ్యతిరేకంగా ఉన్న నేతలకు కూడా ఇది ఒక రాజకీయ అంశంగా మారవచ్చన్నది బీఆర్ఎస్ లెక్కగా కనిపిస్తోంది.

అయితే కాంగ్రెస్ మాత్రం కేటీఆర్ వ్యూహాన్ని కొట్టిపారేస్తోంది. ప్రత్యర్థి పార్టీ చేసే ఫిర్యాదులతో ప్రజాదరణ ఉన్న ముఖ్యమంత్రిపై అధిష్ఠానం చర్యలు తీసుకోదని, కేటీఆర్ కేవలం రాజకీయ ప్రచారం, మీడియా దృష్టి కోసమే ఈ తరహా లేఖలు రాస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

ఫిర్యాదు కాదు.. 'ఫ్రేమింగ్' రాజకీయమా?

మొత్తంగా చూస్తే కేటీఆర్ రాహుల్‌గాంధీకి చేస్తున్న వరుస ఫిర్యాదులను సాధారణ రాజకీయ ఫిర్యాదులుగా చూడటం కంటే.. ఒక 'ఫ్రేమింగ్ గేమ్'గా చూడాల్సి ఉంటుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. రేవంత్‌ను టార్గెట్ చేస్తూ మొదలైన విమర్శను రాహుల్‌గాంధీ వరకు తీసుకెళ్లడం.. అక్కడి నుంచి కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్యంపై చర్చను రేకెత్తించడం.. ఆ చర్చను జాతీయ స్థాయికి తీసుకెళ్లడం.. ఇదే ఈ వ్యూహంలోని అసలు మర్మంగా కనిపిస్తోంది. రేవంత్‌ను కదిలించడం సాధ్యం కాకపోయినా.. రేవంత్ ద్వారా రాహుల్‌ను ప్రశ్నించవచ్చన్న లెక్కే కేటీఆర్ తాజా రాజకీయానికి కేంద్రబిందువా? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది.

# నింగికెగిసిన నటశిఖరం




**ముద్ర, ముంబై :**

ప్రముఖ విలక్షణ నటుడు నానా పటేకర్ (75) గోవాలోని తన నివాసంలో ఈరోజు ఉదయం కన్నుమూశారు. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. ఈ విషాద సమయంలో ఆయన తన మరణం, దహన సంస్కారాల గురించి గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జీవితం పట్లనే కాకుండా మరణం పట్ల కూడా ఆయనకున్న నిర్మొహమాటమైన, విలక్షణమైన వైఖరి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

2023 సెప్టెంబర్ లో 'ది వ్యాక్సిన్ వార్' సినిమా ప్రమోషన్ల సందర్భంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నానా పటేకర్ మరణంపై తన తాత్విక ఆలోచనలను పంచుకున్నారు. తన దహన సంస్కారాలకు 12 మణుగుల (సుమారు 480 కేజీలు) కట్టెలను తాను ఇప్పటికే సిద్ధం చేసి పెట్టుకున్నానని ఆయన ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

"నాకు 12 మణుగుల కట్టెలు అవసరమవుతాయని నాకు తెలుసు. అదే నా చివరి ఆస్తి. దానితోనే నేను వెళ్లిపోతాను" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు తన దహనానికి ఎండిన కట్టెలను మాత్రమే వాడాలని ఆయన స్పష్టంగా కోరారు. "నేను నా 12 మణుగుల కట్టెలను సిద్ధంగా ఉంచాను. అవి బాగా ఎండిపోయాయి. వాటితోనే నన్ను దహనం చేయండి. దయచేసి తడి కట్టెలను అస్సలు ఉపయోగించవద్దు" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

దీనికి గల కారణాన్ని కూడా ఆయన చాలా విభిన్నంగా వివరించారు. తడి కట్టెలు వాడితే వచ్చే పొగ వల్ల అక్కడ ఉన్నవారి కళ్లలో నీళ్లు వస్తాయని, అది చూసి తన కోసం వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని అపోహ పడే అవకాశం ఉంటుందని అన్నారు. తన మరణ సమయంలో అలాంటి గందరగోళం ఉండకూడదని, తన కోసం ఎవరూ ఏడ్చినట్లు భ్రమ కలగకూడదని ఆయన బలంగా ఆకాంక్షించారు. భౌతిక ఆస్తులు, సంపదలు అశాశ్వతమని, మరణం అనేది జీవితంలో ఒక కఠిన వాస్తవమని తాను నమ్ముతానని ఆ ఇంటర్వ్యూలో తెలిపారు. మరణాన్ని కూడా ఇంత నిర్లిప్తంగా, తాత్వికంగా స్వీకరించిన నానా పటేకర్ వైఖరి ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతోందని పలువురు గుర్తుచేసుకుంటున్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు భారీ మద్దతు

**ముద్ర, డెస్క్:**

ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ని వ్యతిరేకిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ), వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, జ్ఞానేష్ కుమార్‌కు భారీ మద్దతు లభించింది. 42 మంది మాజీ న్యాయమూర్తులు సీఈసీకి మద్దతుగా నిలిచారు. ఎన్నికల సంఘంEC), న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచేలా నిరంతర ప్రచారం జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా 'ఓట్ చోరీ' ఆరోపణలు చేయడం, రాజ్యాంగ సంస్థలను దొంగలుగా, రాజీపడిన సంస్థలుగా పదే పదే చిత్రీకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని మాజీ జడ్జీలు హెచ్చరించారు. ''సంస్థల్ని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ కించపరచడం మాత్రం కాదు'' అని వారు లేఖలో పేర్కొన్నారు.

SIR ప్రక్రియను కూడా మాజీ న్యాయమూర్తులు సమర్థించారు. ఓటర్ల జాబితా మరింత స్వచ్ఛంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చట్టబద్ధంగా చేపట్టిన ప్రక్రియ అని అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియను, ఎన్నికల ఫలితాల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ రాజ్యాంగ సంస్థలను పూర్తిగా అనుమానాస్పదంగా చూపించే ప్రయత్నాలు అశాంతికి దారి తీయొచ్చని వారు హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు అరాచక శక్తులకు ఊతమిస్తాయని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి నమ్మకమే పునాది అని వారు వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీలకు అభ్యంతరాలు ఉంటే వాటిని రాజ్యాంగం, చట్టం కల్పించిన మార్గాల్లో పరిష్కరించుకోవాలని మాజీ న్యాయమూర్తులు సూచించారు. ఎన్నికల వివాదాలను న్యాయపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించుకోవాలని, రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయకూడదని హితవు పలికారు.

మరోవైపు, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై విపక్ష పార్టీలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. సర్ పేరుతో భారీ సంఖ్యలో అర్హులైన ఓటర్లను తీసేశారని ఆరోపిస్తున్నాయి. 2025 నాటి ఓటర్ల జాబితానే కొనసాగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఓట్లను తొలగించడం వల్ల బీజేపీకి న్యాయం చేకూరుతోందని, సీఈసీ బీజేపీకి ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. SIRకు సంబంధించిన పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారనే మీడియా నివేదికలను ఆధారంగా చేసుకుని విపక్షాలు ఆందోళలు చేస్తున్నాయి.




# సూపర్-డూపర్ ఎల్‌నినో ముప్పు..!

**మరింత బలపడి 'సూపర్ డూపర్‌గా మారిన ఎల్ నినో'..**
**ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం తప్పదని నిపుణుల హెచ్చరిక**
**ఎల్‌నినో ఎఫెక్ట్ 2027, ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం**



**ముద్ర, న్యూఢిల్లీ :**

ప్రపంచాన్ని 'ఎల్‌నినో' వణికిస్తోంది. ప్రపంచ వాతావరణంపై ఎల్‌నినో తన పంజా విసిరేందుకు సిద్ధమైందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఏర్పడిన ఎల్‌నినో 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన వాతావరణ దృగ్విషయంగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ 'ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ)' హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశ ఉంది. పసిఫిక్ మహాసముద్రంలోని భారీ ఉష్ణశక్తి వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. డబ్ల్యూఎంఓ అంచనా ప్రకారం అక్టోబర్ – నవంబర్–డిసెంబర్ కాలంలో ఎల్ నినోకు కేంద్రంగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా సుమారు 3.7 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది.

వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మాయే ప్రపంచ ఉష్ణోగ్రతలకు సంబంధించిన ప్రపంచ మ్యాప్‌ను సోషల్ మీడివయాలో షేర్ చేశారు. 'భూమి దాదాపు మొత్తం ఎర్రగా ఉంది' అని కామెంట్ చేశారు. ఎల్ నినో చలికాలం వరకు గరిష్టస్థాయికి చేరుకోవచ్చని, అమెరికా మినహా అనేక ప్రాంతాల్లో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరో వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ పసిఫిక్ ప్రాంతంలో 3.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలను 'సూపర్ డూపర్ ఎల్ నినో'గా అభివర్ణించారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడాన్ని ''ఎల్ నినో' గా వ్యవహరిస్తారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా వర్షాల్లో అసమానతలు చోటుచేసుకుంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడితే, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు ముప్పు పెరుగొచ్చు. ఈ ఎల్ నినో 2024 ఫిబ్రవరి వరకు కొనసాగొచ్చని అంచనా వేస్తున్నారు.

# కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది దరఖాస్తు

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది, ఎన్ఆర్ఐలు 6వేల మంది దరఖాస్తు చేసుకున్నారని సీఈవో కార్యాలయం తెలిపింది. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 5,04,782 దరఖాస్తు చేసుకున్నారని ప్రకటించింది. ఓటు తొలగింపు కోసం 24,323 ఫారం–7లు అందాయని పేర్కొంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు నిన్నటితో ముగిసింది. నవంబరు 5 వరకు దరఖాస్తులను పరిష్కరించి.. నవంబరు 9న తుది జాబితాలో ప్రచురిస్తారు. హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం 6,335 ఫామ్–7లు వచ్చినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. నగరంలో భారీగా బోగస్ ఫామ్‌లు దరఖాస్తు చేశారని కొన్ని రోజులుగా రాజకీయ వివాదం కొనసాగుతోంది. వివాదం నెలకొన్న ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫామ్–7లు రాగా... అందులో 87 తొలగించినట్లు సీఈవో కార్యాలయం తెలిపింది. గోషామహల్‌లో 222 దరఖాస్తులు రాగా 87 తొలగించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి 6,335 ఫామ్–7లు అందగా.. ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు కొత్తగా ఓటు నమోదు కోసం రాష్ట్రంలో అత్యధిక ఫామ్–6లు హైదరాబాద్ జిల్లాలోనే వచ్చినట్లు సీఈవో కార్యాలయం వెల్లడించింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 09.10.2026
www.mudranews.in | @mudranews



## పల్లీలతో జీర్ణక్రియపై ప్రభావం

పల్లీల్లో కొవ్వు, ప్రోటీన్లు ఎక్కువగా ఉండటంతో అవి జీర్ణం కావడానికి సమయం పడుతుంది. వెంటనే ఎక్కువ నీరు తాగితే కొందరిలో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు రావచ్చు.



## ఐలు జాతీయ అధ్యక్షుడు బికాష్ రంజన్ భట్టాచార్య నివాసంపై దాడిని తీవ్రంగా ఖండించండి

**- రామన్నపేట కోర్టు ఆవరణలో నిరసన**
**- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి**

**రామన్నపేట ముద్ర:** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU) జాతీయ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య కోల్ కతాలోని నివాసంపై ఈరోజు తెల్లవారుజామున దుండగులు దాడి చేసి, కిటికీ అద్దాలను పగులగొట్టి, సీసీటీవీ కెమెరాను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేటలో న్యాయవాదులను నిరసన కార్యక్రమం నిర్వహించారు. జరిగింది అనంతరం మామిడి వెంకటరెడ్డి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) నిరంకుశ చర్యలకు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న భట్టాచార్యను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఈ దాడి జరిగిందని అన్నారు.

బీజేపీ–ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దుండగుల ఈ చర్యను ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిని, ప్రేరేపించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పశ్చిమ బెంగాల్ లోని వివిధ కోర్టుల వద్ద న్యాయవాదులపై జరుగుతున్న వరుస దాడులు న్యాయవాద వృత్తి స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్య హక్కులకు తీవ్ర ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేసింది. దాడులపై నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని, న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఐలు కమిటీలు, న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, ఎండి ఖయ్యూం, గడ్డం నరసింహ, రమేష్, తాటిపాముల కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జూబిలీ హిల్స్ స్కూల్ , ఏసర్ మధ్య ఒప్పందం



**ముద్ర, హైదరాబాద్ :** వృత్తిపరమైన నాణ్యత , మరియు క్రమబద్ధమైన పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఉపాధ్యాయులలో అవగాహనను పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని డాక్టర్ ప్రియాంక శర్మ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని జూబిలీహిల్స్ పబ్లిక్ స్కూల్ లో గురువారం రోజు విద్యా కార్యక్రమాలుపై ఏసర్ ఒక విజ్ఞానదాయకమైన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఏసర్ ఇండియా సి ఇ ఓ డాక్టర్ ప్రియాంక శర్మ పాల్గొన్నారు . డాక్టర్ ప్రియాంక శర్మ మాట్లాడుతూ – '150కి పైగా దేశాలలో పనిచేస్తున్న, వందేళ్ల చరిత్ర కలిగిన అంతర్జాతీయ విద్యా పరిశోధన సంస్థ అయిన ఆస్ట్రేలియన్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ (ACER) సమస్త మహత్తరమైన పాత్ర నిర్వహిస్తుంది, అంచనాలు, మదింపులు, విద్యార్థుల మానసిక సామర్థ్యాలు, ప్రవర్తన, ఆలోచనా సరళి మరియు వ్యక్తిత్వ లక్షణాలను శాస్త్రీయంగా విశ్లేషించే మనస్తత్వ శాస్త్రం, ఆ దిశగా పరిశోధన మరియు విద్యార్థుల అభ్యాసన, పురోగతిని పర్యవేక్షించడంలో ఏసర్ నైపుణ్యం సాటిలేనిది' చెప్పారు .స్కూల్ ఇంప్రూవ్‌మెంట్ టూల్ (SIT) మాట్లాడుతూ 'ఇది దత్తాంశ ఆధారిత అభివృద్ధి, అభ్యాసన సంస్కృతి, సమర్థవంతమైన బోధనా పద్ధతులు, విభిన్న బోధన, క్రమబద్ధమైన పాఠ్యప్రణాళిక అమలు, నిపుణుల బోధన మరియు పాఠశాల–సమాజ భాగస్వామ్యాలు వంటి తొమ్మిది కీలక రంగాల ద్వారా క్రమబద్ధమైన సంస్థాగత అభివృద్ధికి ఈ సంస్థ మద్దతు ఇస్తుంది' అని చెప్పారు . ఈ కార్యక్రమంలో ఒక ముఖ్యమైన మైలురాయి గురించి మాట్లాడుతూ , ఏసర్ స్కూల్ ఇంప్రూవ్‌మెంట్ టూల్ ను అమలు చేయడానికి జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ మరియు ఏసర్ మధ్య ఒక అవగాహన ఒప్పందం జరిగిందని శర్మ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఒక భాగస్వామ్యం అధికారికంగా ప్రకటించడం జరిగిందని ఆమె చెప్పారు . విద్యార్థుల మూల్యాంకనం మరియు పురోగతి పర్యవేక్షణను బలోపేతం చేయడం, సాక్ష్యాధారిత ఉపాధ్యాయ అభివృద్ధికి మద్దతు ఇవ్వడం, మరియు నిరంతర పాఠశాల అభివృద్ధికి ఒక నిర్మాణాత్మక ప్రణాళికను అందించడం ఈ సహకారం ముఖ్య లక్ష్యాలు. ఈ కార్యక్రమాల కోసం అవగాహన ఒప్పందంపై సంతకం చేసిన మొదటి పాఠశాల జూబిలీహిల్స్ పాఠశాల కావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు . విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని సాకారం చేసినందుకు జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తమ ఆహ్వానాన్ని అంగీకరించి, విలువైన అంసమాచారాన్ని పంచుకున్నందుకు డాక్టర్ ప్రియాంక శర్మకు జూబిలీహిల్స్ స్కూల్ తరుపున ధన్యవాదాలు తెలిపారు .

## అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం

**ముద్ర, ఢిల్లీ** : రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. భేటీలో రాష్ట్రానికి సంబంధించి పెండింగులో ఉన్న వివిధ అంశాలపై చర్చించారు. దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై ఈ భేటీలో చర్చ జరిగింది. గోదావరి–కావేరి నదుల అనుసంధానం గురించి దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించామని... దీన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు చొరవ తీసుకోవాలని అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

## ఓయో హోటల్‌లో యువతి హత్య కేసులో ప్రియుడు అరెస్ట్

**ముద్ర, హైదరాబాద్:** నగరంలోని ఎస్ఆర్ నగర్‌లో సంచలనం సృష్టించిన యువతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఓయో హోటల్‌లో శిరీష అనే యువతిని హత్య చేసిన ఆమె ప్రియుడు శ్రీనివాస్‌ను ఎస్ఆర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శిరీష, శ్రీనివాస్ కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. పెళ్లి చేసుకోవాలని శిరీష కోరడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఓయో హోటల్‌లో శిరీషపై శ్రీనివాస్ దాడికి పాల్పడ్డాడు. హోటల్‌లోని కర్టెన్ పైపుతో ఆమెను కొట్టి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్య అనంతరం నిందితుడు మృతదేహాన్ని ముక్కలుగా చేసి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. శిరీష వద్ద ఉన్న సుమారు రూ.4 లక్షల నగదును కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు దారితీసిన కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# తుగ్లక్ నిర్ణయాలతో బొగ్గు ఉత్పత్తి పడిపోయింది..

**14న రామగుండంలో సింగరేణి కార్మిక గర్జన సభ**
**కార్మికుల హక్కులు, డిపెండెంట్ ఉద్యోగాలపై డిమాండ్లు**
**బొగ్గు ఉత్పత్తి తగ్గిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**
**గుర్తింపు యూనియన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్**



**ముద్ర, హైదరాబాద్ :** సింగరేణి బొగ్గు గని ప్రాంత సమస్యలు, కార్మికుల సంక్షేమంపై మాజీ మంత్రి హరీష్ రావు అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 14న రామగుండంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభకు 'సింగరేణి కార్మిక గర్జన' అని పేరు నిర్ణయించినట్లు వెల్లడించారు. సింగరేణి సంస్థ ఆర్జించే లాభాల్లో కార్మికులకు చెల్లించాల్సిన వాటాను వెంటనే ఇవ్వాలని, అర్హులైన కార్మిక కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వీటితో పాటు ఎంతమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని, అలాగే ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన పెండింగ్ బిల్లుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు.

**తుగ్లక్ నిర్ణయాలతో పడిపోయిన బొగ్గు ఉత్పత్తి**

కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత, తుగ్లక్ నిర్ణయాల వల్లే నేడు సింగరేణి సంస్థ ఆదాయం గణనీయంగా పడిపోయిందని హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ఎప్పటిలాగే కష్టపడి పనిచేస్తున్నప్పటికీ, యాజమాన్యం , ప్రభుత్వ వైఫల్యం వల్ల ఉత్పత్తి దారుణంగా తగ్గిపోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏకంగా 12 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి తగ్గిపోయిందని ఆరోపించారు. గతంలో 70 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి, నేడు 58 మిలియన్ టన్నులకు పడిపోవడం ప్రభుత్వ అసమర్థ పరిపాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

**సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు**

సంస్థలో సమర్థులైన, నిజాయితీ కలిగిన అధికారులను పక్కనబెట్టి, సింగరేణిని కాంగ్రెస్ నాయకులు కుంభకోణాల గనిగా మార్చేశారని హరీష్ రావు ధ్వజమెత్తారు. ఒకవైపు బొగ్గు కొరత నెపంతో రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయి, పంటలు ఎండిపోతుంటే, మరోవైపు కరెంట్ కోతలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయన్నారు. రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రకటనలతో కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలోనే సింగరేణి పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం రామగుండంలో నిర్వహించే 'కార్మిక గర్జన' సభను విజయవంతం చేయాలని హరీష్ రావు పిలుపునిచ్చారు.

# అది ఫేక్ ఫొటో.. నమ్మొద్దు : సీపీ సజ్జనార్

**ముద్ర, హైదరాబాద్:** సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ ఫొటో అని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ అభిమానులు కొందరు తన ఫొటోను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ సినీనటుడు ఎన్టీఆర్‌కు చెందిన సోషల్ మీడియా ఖాతాను ట్యాగ్‌చేశారు. "అది ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఫొటో. దయ చేసి నెటిజన్లు ఇలాంటి డీప్‌ఫేక్ వలలో పడకండి. వాటిలో నిజానిజాలు తెలుసుకోకుండా షేర్ చేయొద్దు. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలు రోజు రోజుకీ మరింత వాస్తవికంగా కనిపిస్తున్నందున.. ఆన్‌లైన్‌లో చూసేవాటి వెనుక వాస్తవాలు తెలుసుకోవడం ముఖ్యం. ఏదైనా ఫొటో నమ్మశక్యంగా కనిపించినంత మాత్రాన అది నిజమైంది కాదు. ప్రజలు వాస్తవాలను సరి చూసుకోకుండా కంటెంట్‌ను షేర్ చేసినప్పుడు తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతుంది" అని సజ్జనార్ పోస్టు చేశారు. 'దేవర' చిత్రంలోని "చుట్టమల్లే..." పాటను ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన నిందితులను సీపీ సజ్జనార్ అరెస్ట్ చేశారంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో సీపీ సజ్జనార్ స్పందించి.. అది ఫేక్ ఫొటో అని క్లారిటీ ఇచ్చారు.




## జూరాల కాలువకు నీళ్లు వదిలిన రైతులపై కేసు

**ముద్ర, వనపర్తి :** వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీళ్లు వదిలిన 14 మంది రైతులపై కేసు నమోదు చేసినట్లు అమర చింత ఎస్సై స్వాతి వెల్లడించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు, నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించక పోవడంతో సెప్టెంబర్ 19న సాయంత్రం వారే బలవంతంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారు.19, 20 తేదీల్లో చేపట్టి న ఆందోళనల నేపథ్యంలో కేసులు నమోద య్యాయి. 21వ తేదీన ధర్నా చేసిన బీఆర్ఎస్, భాజపా నేతలపైనా కేసులు నమోదయ్యాయి.

## నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా స్పందన రాజీవ్

*** ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో బాధ్యతలు**
***స్పందన రాజీవ్ కు పలువురి అభినందనలు**
***నూతన బాధ్యతలపై హర్షం**
***నేరేడుచర్ల మార్కెట్ కమిటీ అభివృద్ధిపై ఆశాభావం**



**ముద్ర, నేరేడుచర్ల:** హుజూర్ నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ గా చలసాని స్పందన రాజీవ్ నియమితులయ్యారు. భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ఆయనకు ఈ బాధ్యతలు దక్కాయని పేర్కొంటూ పలువురు వారు నూతన బాధ్యతలను సమర్థవంతంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం నిర్వహించి మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వ్యక్తం చేశారు. నూతన మార్కెట్ కమిటీ వంతు కృషి చేయాలని కోరారు. చైర్మన్ గా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టనున్న చలసాని ఆయన పదవీకాలం విజయవంతంగా రాజీవు పలువురు అభినందనలు, కొనసాగాలని ఆకాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ అభినందనలు తెలిపారు. పరిధిలో రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

### నిమిషాంబ దేవి ఆలయంలో
## 11 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

**- ఈ ఏడాది నుంచి అమ్మవారి మాలధారణ దీక్ష ప్రారంభం**
**- ప్రతిరోజూ సామూహిక చండీ హోమం, విశేష అలంకరణలు**



**ముద్ర, బోడుప్పల్:** సోమవంశ క్షత్రియుల కులదేవత శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 11వ తేదీ ఆదివారం నుంచి 20వ తేదీ మంగళవారం విజయదశమి వరకు కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె. అశోక్ కుమార్ తెలిపారు. హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం నుంచి "శ్రీ మాతా నిమిషాంబ దేవి మాలధారణ దీక్ష"ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల మొదటి రోజు భక్తులు మాలధారణ స్వీకరిస్తారని, దసరా పండుగ రోజు ఉదయం దీక్ష విరమణ ఉంటుందని తెలిపారు. నవరాత్రుల్లో ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణతో పాటు సామూహిక చండీ హోమం నిర్వహిస్తామన్నారు. సరస్వతి దేవి అలంకరణ రోజున విద్యార్థినీ విద్యార్థులచే సామూహిక సరస్వతి హోమం, అన్నపూర్ణ దేవి అలంకరణ రోజున సామూహిక అన్నప్రసాద వితరణ ఉంటాయని వివరించారు.

**దర్శన, ప్రదక్షిణ వేళలు**

ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఆలయం తెరిచి ఉంటుందని, ఈ సమయాల్లో 16, 108 ప్రదక్షిణలకు అనుమతిస్తామని తెలిపారు. ప్రదక్షిణలు చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, మంచినీరు, ప్రసాదాలను ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

**ప్రజా రవాణాలో రావాలని విజ్ఞప్తి**

ఆలయం వద్ద పూర్తిస్థాయి పార్కింగ్ సౌకర్యం లేనందున భక్తులు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, క్యాబ్‌లు, బస్సుల్లో రావాలని కోరారు. మెట్రో రైలులో వచ్చేవారు ఉప్పల్ వరకు చేరుకుని, అక్కడి నుంచి ప్రజా రవాణా ద్వారా ఆలయానికి రావచ్చని సూచించారు. భక్తులందరూ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ చైర్మన్ శ్రీ కామరౌతు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీ కె. అశోక్ కుమార్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాసరావు కోరారు.

### గోదావరి-కావేరి అనుసంధానంతో
## దక్షిణాదిలో అద్భుత ఫలితాలు



**కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్**
**గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి**
**ప్రధాని మోదీతో భేటీలో సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు**

**ముద్ర, ఢిల్లీ :** గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో రాష్ట్రాభివృద్ధి, సాగునీరు, పోలవరం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక పరిస్థితిపై పలు అంశాలను వివరించారు. నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని సీఎం తెలిపారు. దేశంలో రహదారులు, పవర్‌గ్రిడ్ తరహాలో భవిష్యత్‌లో 'వాటర్‌గ్రిడ్' ఏర్పాటుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. అలాగే రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని, వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడిందని వివరించారు.

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, విశాఖ మెట్రో, బీచ్ రోడ్డు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే 'స్వర్ణాంధ్ర–2047' విజన్‌ను కూడా ప్రధానికి వివరించారు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ శక్తిగా ఎదుగుతోందని కొనియాడారు.

ముద్ర
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 09 అక్టోబర్, 2026


నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com



## ఫ్రైడ్ రైస్ తింటున్నారా?

# యమ డేంజర్

ప్రతిరోజు సాయంత్రం లేదా వీకెండ్ లో స్ట్రీట్ ఫుడ్ తినాలని చాలా మంది ఆశ పడుతూ ఉంటారు. రోజు ఇంట్లో వండిన ఆహారానికి బయట దొరికే ఆహారం భిన్నమైన రుచిని కలిగి ఉండడంతో ఇలా ఇష్టపడుతుంటారు. అయితే ఇలాంటి ఆహారాలు ఎంత రుచిగా ఉన్నాయో అంతే ఆరోగ్య సమస్యలను ఇస్తాయి. వీటిలో ముఖ్యంగా ఫ్రైడ్ రైస్ పదేపదే తినడం వల్ల అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇందులో ఉండే బాసిల్లస్ సెరియస్ అనే బ్యాక్టీరియా ఎంత వేడి చేసినా కూడా చనిపోకుండా ఉండడంతో.. ఇది మానవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మరి ఇది ఎలాంటి సమస్యలను కలగజేస్తుందో చూద్దాం..

సాధారణంగా అన్నంను వేడి చేసిన తర్వాత.. వెంటనే ఫ్రైడ్ రైస్ తయారు చేస్తే ఎలాంటి సమస్యలు ఉండవు. కానీ ఒకసారి వేడి చేసిన ఆహారాన్ని కనీసం రెండు గంటల నిల్వ ఉంచడంతో ఇందులో బాసిల్లస్ సెరియస్ అనే బ్యాక్టీరియా ఉంటుంది. ఇది ఎన్ని డిగ్రీల్లో వేడి చేసిన కూడా చనిపోకుండా ఉండే అవకాశం ఉందని కొందరు వైద్యులు తెలుపుతున్నారు. ఈ బ్యాక్టీరియా ఇలాగే ఉండి ఆహారంలో కలిసిపోతుంది. అప్పుడు ఫ్రైడ్ రైస్ తిన్నవారిలో అనేక విష పదార్థాలను విడుదల చేస్తుంది. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

ఇలాంటి ఫ్రైడ్ రైస్ తినడం వల్ల కొందరికి వికారం, వాంతులు, కడుపులో అసౌకర్యం ఏర్పడతాయి. మరి కొన్ని గంటల తర్వాత విరోచనాలు, కడుపునొప్పి, లేదా పొట్టలో సమస్యలు ఉంటాయి. అయితే కొందరు పదేపదే ఫ్రైడ్ రైస్ తింటూ ఉంటారు. ఫ్రైడ్ రైస్ తయారు చేసేటప్పుడు ఇందులో నూనె, ఉప్పు, సాస్, శుద్ధిచేసిన కార్బోహైడ్రేట్లు ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఇవి అధిక కేలరీలతో పాటు, సోడియం ను ఎక్కువగా కలిగి ఉంటాయి. దీంతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

అయితే బయట లభించే నీ ఫ్రైడ్ రైస్ లో ఇలాంటి సమస్యలు ఉంటాయని చెప్పలేం. కానీ కొందరు సరైన ప్రమాణాలతో దీన్ని తయారు చేయకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా శుభ్రత లేని ప్రదేశంలో ఈ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. కొందరు ఉదయం వండిన ఆహారాన్ని సాయంత్రం వరకు అలాగే ఉంచితే కూడా ఈ సమస్యలు ఉంటాయి. అందువల్ల బయట లభించే ఫ్రైడ్ రైస్ కు ఎక్కువగా అలవాటు పడకుండా.. ఇంట్లోనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తయారు చేసుకోవడం ఉత్తమం. ఒకవేళ ఇప్పటికే ఈ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తే ఇకనుంచి అయినా.. సాత్విక ఆహారం లేదా రొటీన్ కలిగిన ఆహారం తీసుకోవడం మంచిది. ముఖ్యంగా ఆయిల్, ఉప్పు ఎక్కువగా కలిగిన ఆహారానికి దూరంగా ఉండటం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు.

# లివర్ ఆరోగ్యంపై అవగాహన



అన్నమయ్య జిల్లా వెంకటగిరిలో గౌరవ శాసనసభ్యులు శ్రీ కురుగొండ్ల రామకృష్ణ తమ నియోజకవర్గ ప్రజలకు లివర్ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ఈ రోజు ఒక విశేషమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో లండన్‌లో సుమారు 10 సంవత్సరాల వైద్య అనుభవం సంపాదించి, తల్లిదండ్రుల కోరిక మేరకు భారతదేశానికి తిరిగి వచ్చి, చెన్నై గ్లోబల్ హాస్పిటల్లో లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న ప్రముఖ వైద్యులు డా. పచ్చా రజనీకాంత్ గారు పాల్గొని ప్రజలకు లివర్ వ్యాధులు, లివర్ మార్పిడి శస్త్రచికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

లివర్ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని ఆరోగ్యం పొంది, ప్రస్తుతం సాధారణ జీవితం గడుపుతున్న పలువురు తమ అనుభవాలను పంచుకోవడం ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకువచ్చింది. మురుగుళ్ల గ్రామం నుంచి మేము పాల్గొనడం ఎంతో ఆనందంగా అనిపించింది.

ఎందుకంటే డా. పచ్చా రజనీకాంత్ గారు మన నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం, మురుగుళ్ల గ్రామానికి చెందినవారు. వారి తల్లిదండ్రులు శ్రీ పచ్చా శేషయ్య గారు, శ్రీమతి సుజాతమ్మ గారు.

అంతర్జాతీయ స్థాయిలో వైద్య అనుభవాన్ని సంపాదించి, భారతదేశానికి తిరిగి వచ్చి లివర్ మార్పిడి వైద్య రంగంలో సేవలందిస్తున్న డా. రజనీకాంత్ గారు మన స్వగ్రామానికి చెందినవారు కావడం మురుగుళ్ల గ్రామానికే కాదు, ఆత్మకూరు ప్రాంత ప్రజలందరికీ గర్వకారణం. మన గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ప్రతిభావంతుడైన వైద్యుడిని అభినందించడం మనందరి బాధ్యత.

ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ కురుగొండ్ల రామకృష్ణ గారికి అభినందనలు. డా. పచ్చా రజనీకాంత్ గారికి హృదయపూర్వక అభినందనలు మరియు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షలు.

పొన్నం శ్రీరాములు
రిటైర్డ్ హెడ్మాస్టర్
మురుగుళ్ల – ఆత్మకూరు – నెల్లూరు



# పూల తత్వం.. బతుకమ్మ స్ఫూర్తి

## మానవత్వమే మన పరిమళం

పువ్వులు ప్రకృతి మనకందించిన గొప్ప వరాలు. అవి కేవలం అందాన్ని, పరిమళాన్ని అందించే పుష్పాలు మాత్రమే కావు. జీవితం, ప్రేమ, ఆనందం, అనుబంధం, భక్తి, త్యాగం, మానవత్వానికి ప్రతీకలు. రంగుల హరివిల్లులా విరబూసే పూలు మనసుకు ఆహ్లాదాన్ని పంచుతాయి. కవులకు కవిత్వాన్ని, కళాకారులకు స్ఫూర్తిని, భక్తులకు భక్తి పారవశ్యాన్ని, ప్రేమికులకు ప్రేమాభివ్యక్తిని అందిస్తాయి. పువ్వులు పుట్టి వికసించి వాడిపోయినట్లే మనిషి జీవితం కూడా బాల్యం నుంచి యవ్వనం, వృద్ధాప్యం వరకు వివిధ దశలను



డా. రాజారామ్ సుంకరి
నల్గొండ, 7799910222

దాటుతుంది. పువ్వు తన సహజ లక్షణమైన పరిమళాన్ని ఎవరినీ అడిగి పంచదు. తన ఉనికిలోనే పరిమళాన్ని వెదజల్లుతుంది. మనిషి కూడా తన సహజమైన మానవత్వాన్ని చుట్టూ ఉన్నవారికి పంచాలి. పువ్వులకు కులం లేదు. మతం లేదు. ప్రాంతీయ భేదం లేదు. ఏ పువ్వైనా అందంగా వికసిస్తుంది. గులాబీకి ఒక రంగు, మల్లెకు మరో పరిమళం, తంగేడు పువ్వుకు మరో ప్రత్యేకత ఉన్నప్పటికీ అవన్నీ పూలే.



### భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలు

మరి మనుషుల మధ్యే కులం, మతం, ప్రాంతం, వర్గం పేరుతో ఇన్ని భేదాలు ఎందుకు? పూలు తమ పరిమళాన్ని పంచుతున్నామని ఎప్పుడూ గొప్పలు చెప్పుకోవు. తమ అందాన్ని చూసి ఇతరులు ఆనందిస్తున్నారని అహంకరించవు. తమ సహజ లక్షణాన్ని మాత్రమే ప్రదర్శిస్తాయి. మనిషి మాత్రం తన చిన్న సహాయాన్నే పెద్ద త్యాగంగా భావించే స్థితికి చేరుకుంటున్నాడు. ప్రకృతిలో అత్యంత తెలివైన జీవిగా ఎదిగిన మనిషి, మానవత్వంలో మాత్రం ఎందుకు వెనుకబడుతున్నాడో ఆలోచించాల్సిన సమయం ఇది.

### బతుకమ్మ.. పూలతో ప్రకృతికి నివాళి

ఇలాంటి పూల తత్వాన్ని మనకు గుర్తుచేసే తెలంగాణ పండుగే బతుకమ్మ. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ప్రకృతి, పూలు, మహిళ, కుటుంబం, సమాజం, పర్యావరణం—ఇవన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే విశిష్టమైన పండుగ ఇది. వివిధ రకాల సహజ పుష్పాలను పేర్చి బతుకమ్మను తయారు చేసి, దాని చుట్టూ చేరి మహిళలు పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఆనందాన్ని పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. బతుకమ్మలో ఉపయోగించే తంగేడు, గునుగు, బంతి, చామంతి, గన్నేరు, నందివర్ధనం వంటి పూలన్నీ ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయి. బతుకమ్మ కేవలం ఒక పండుగ కాదు. అది ఒక జీవన తత్వం "అందరూ బాగుండాలి.. అందరూ సుఖసంతోషాలతో జీవించాలి" అనే సామూహిక ఆకాంక్షకు ప్రతిరూపం. స్త్రీల జీవితాలు పూలంత సున్నితమైనవని చెప్పుకుంటాం. కానీ ఆ స్త్రీలనే కన్నీళ్లకు, కష్టాలకు, అణచివేతకు గురి చేస్తే మనం పూలను పూజించినంత మాత్రాన ప్రయోజనం ఏమిటి? స్త్రీలను గౌరవించడం, సమానంగా చూడడం, వారి స్వేచ్ఛను మరియు గౌరవాన్ని కాపాడడం—ఇదే బతుకమ్మకు నిజమైన నివాళి.

### పూల తత్వాన్ని మరచిపోతున్నామా?

ప్రకృతిలోని ప్రతి పువ్వు తన ప్రత్యేకతతో వికసిస్తుంది. ఒక పువ్వు మరొక పువ్వును తక్కువగా చూడదు. కానీ మనిషి మాత్రం మనిషినే కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి పేరుతో విభజించుకుంటున్నాడు. పువ్వుల రంగులు వాటి అందాన్ని పెంచుతాయి. భేదాలను కాదు. అలాగే మనుషుల మధ్య ఉన్న భిన్నత్వం సమాజానికి అందాన్ని ఇవ్వాలి కానీ విభేదాలకు కారణం కాకూడదు. పువ్వుకు చెట్టు ఆధారం. చెట్టుకు నేల ఆధారం. నేలకు నీరు, గాలి, ప్రకృతి ఆధారం. ఈ పరస్పర ఆధారిత జీవన విధానమే మనిషికీ వర్తిస్తుంది. మనిషి ప్రకృతిలో భాగమే. ప్రకృతిని నాశనం చేస్తే చివరికి నాశనం అయ్యేది మనిషి జీవితం కూడా. పచ్చదనం లేని భూమి, పూల పరిమళం లేని ప్రకృతి, స్వచ్ఛమైన గాలి లేని ప్రపంచంలో మానవ జీవితం ఎంతకాలం కొనసాగుతుంది? అందుకే ప్రకృతి పరిరక్షణ కూడా బతుకమ్మ సందేశంలో ఒక ముఖ్యమైన భాగంగా మనం గుర్తించాలి. పండుగను జరుపుకుందాం.. పండుగ స్ఫూర్తిని కాపాడుకుందాం కాలం మారుతోంది. జీవనశైలి మారుతోంది. పండుగలను జరుపుకునే విధానాల్లోనూ మార్పులు వస్తున్నాయి. మార్పు సహజమే. అయితే మార్పు పేరుతో పండుగల అసలు స్ఫూర్తిని కోల్పోకూడదు. బతుకమ్మ సందర్భంగా సంప్రదాయ పాటలు, జానపద గీతాలు, స్థానిక కళారూపాలు, సహజ పుష్పాల వినియోగం వంటి అంశాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయ బతుకమ్మ పాటలకు బదులుగా సినిమా పాటలు, డీజే సంగీతం, ఇతర నృత్యరూపాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. యువతలో కొత్త ఉత్సాహం కనిపించడం మంచిదే. కానీ ఆ ఉత్సాహం పండుగ అసలు స్వరూపాన్ని మరుగున పడేలా చేయకూడదు. మన పండుగలో మన పాట ఉండాలి. మన సంస్కృతిలో మన జానపదం ఉండాలి. మన బతుకమ్మలో మన తెలంగాణ మట్టి పరిమళం ఉండాలి. సినిమా పాటలు వినకూడదని కాదు. వినోదం ఉండకూడదని కాదు. కానీ వినోదం కోసం పండుగను మార్చకుండా, పండుగ స్ఫూర్తి లోనే వినోదాన్ని ఆస్వాదించాలి.

### బతుకమ్మ ఇచ్చే అసలు సందేశం

బతుకమ్మ మనకు పూలను మాత్రమే చూపించదు. పూల తత్వాన్ని నేర్పుతుంది.
పువ్వులా నవ్వాలి.
పువ్వులా పరిమళించాలి.
పువ్వులా అందరినీ ఆనందింపజేయాలి.
పువ్వులా భేదాలు లేకుండా ఉండాలి.
ప్రకృతిని ప్రేమించాలి.
స్త్రీలను గౌరవించాలి.
తోటి మనిషిని మనిషిగా చూడాలి.
ప్రకృతి విధ్వంసం పర్యావరణ విపత్తులకు దారితీసినట్లే, మానవత్వం క్షీణించడం సామాజిక విపత్తులకు దారితీస్తుంది. కుల, మత ద్వేషాలు, స్త్రీలపై హింస, అసమానత, వివక్ష వంటి వాటిని సమాజం నుంచి తొలగించాలి. స్త్రీలను పూలతో పోల్చడం మాత్రమే కాదు–పూలంత గౌరవంతో, సమానత్వంతో వారిని చూడాలి.
బతుకమ్మను పేర్చే ప్రతి పువ్వు మనకు ఒక సందేశం ఇస్తుంది.
"నీవు ఏ రంగులో ఉన్నా.. ఏ రూపంలో ఉన్నా.. నీ పరిమళాన్ని పంచు" అని. మన సమాజం కూడా అలాంటి పూలతోటగా మారాలి. కులం, మతం, ప్రాంతం, వర్గం అనే గోడలను దాటి మనిషిని మనిషిగా ప్రేమించే సమాజాన్ని నిర్మించాలి.
పూలు ప్రకృతిని పరిమళింపజేస్తే..
మానవత్వం సమాజాన్ని పరిమళింపజేస్తుంది.
ఈ బతుకమ్మ సందర్భంగా మనం పూలను పూజించడంతో పాటు, పూలు నేర్పే తత్వాన్ని కూడా మన జీవితాల్లో ఆచరిద్దాం.
పూలలా పరిమళిద్దాం..
బతుకమ్మ స్ఫూర్తిని కాపాడుదాం..
మానవత్వంతో సమాజాన్ని వికసింపజేద్దాం.
అందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు.

# జాతీయ స్థాయిలో మెరిసిన సిద్దిపేట చిత్రకళ



బల్లెడ నాగేశ్వరరావు
బోడుప్పల్

శతాబ్దాల చరిత్ర కలిగిన తెలంగాణలోని సిద్దిపేట జిల్లా చేర్యాల నకాష్ పెయింటింగ్ కళకు దేశ అత్యున్నత వేదిక రాష్ట్రపతి భవన్‌లో అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణకు చెందిన ప్రముఖ నకాష్ కళాకారులు ధనలకోట నాగేశ్వర్, ధనలకోట సాయికిరణ్, ధనలకోట శ్రవణ్ కుమార్ తమ కళా ప్రతిభతో రాష్ట్రపతి భవన్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు.

### జాతీయ వదికపై చేర్యాల వైభవం

న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 5 వరకు నిర్వహించిన ప్రతిష్టాత్మక 'Artist-in-Residence' కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న చేర్యాల చిత్రకళలోని కథనశైలి, ప్రత్యేక రంగులు, ఆకృతులు, జానపద దృశ్యాలను తమ కళాఖండాల ద్వారా జాతీయ వేదికపై ఆవిష్కరించారు. వికసిత్ భారత్ ఇతివృత్తంగా రూపొందించిన చిత్రాల్లో భారతదేశ సాంస్కృతిక వారసత్వం, ప్రజాజీవనం, సంప్రదాయాలు, వైవిధ్యంలో ఏకత్వాన్ని చేర్యాల చిత్రకళా శైలిలో ప్రతిబింబించారు.

### రాష్ట్రపతి చేతుల మీదుగా సన్మానం

ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అక్టోబర్ 5న రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ముగ్గురు తెలంగాణ నకాష్ కళాకారులు సన్మానం అందుకున్నారు. ఈ గౌరవం కేవలం ముగ్గురు కళాకారులకు దక్కిన వ్యక్తిగత గుర్తింపుగానే కాకుండా.. శతాబ్దాలుగా చేర్యాల చిత్రకళను కాపాడుకుంటూ వస్తున్న తెలంగాణ నకాష్ కళాకారుల సమాజానికి లభించిన జాతీయ గుర్తింపుగా కళాకారులు భావిస్తున్నారు.

### నకాష్ చిత్రకళ అంటే ఏమిటి?

నకాష్ చిత్రకళ అనేది తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రాచీన జానపద చిత్రకళా సంప్రదాయం. పురాణ గాథలు, జానపద కథలు, గ్రామీణ జీవన విధానాలను రంగురంగుల బొమ్మల రూపంలో చిత్రించి, వాటి ద్వారా కథలు చెప్పడం ఈ కళ ప్రత్యేకత. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా చేర్యాల చిత్రకళ నకాష్ కళకు ప్రసిద్ధమైన రూపం.

### నకాష్ చిత్రకళ ప్రత్యేకతలు

**కథ చెప్పే చిత్రాలు:** రామాయణం, మహాభారతం, కృష్ణలీలలు, జానపద గాథలు చిత్రిస్తారు.

**ప్రత్యేక రంగులు:** ఎరుపు నేపథ్యంపై పసుపు, ఆకుపచ్చ, నీలం, తెలుపు, నలుపు రంగులను ఉపయోగిస్తారు.

**సహజ పదార్థాలు:** ఖాదీ వస్త్రం, చింతగింజల జిగురు, బియ్యం గంజి, సహజ వర్ణాలతో సంప్రదాయ చిత్రాలను తయారుచేస్తారు.

**పొడవైన చిత్రపటాలు:** ఒక కథలోని వివిధ ఘట్టాలను వరుసగా చిత్రిస్తారు. ఇవి నేటి కామిక్ పుస్తకాల మాదిరిగా ఉంటాయి.

### చిత్రకళకు నకాష్ పేరు ఎలా వచ్చింది?

'నకాష్' లేదా 'నక్కాష్' అనే పదానికి చిత్రకారుడు, అలంకార చిత్రాలను గీసే కళాకారుడు అనే అర్థాలు ఉన్నాయి. ఈ కళను తరతరాలుగా కొనసాగిస్తున్న కళాకారులను నకాషీలు అని పిలుస్తారు. పూర్వం జానపద కథకులు గ్రామగ్రామాన తిరుగుతూ ఈ చిత్రపటాలను ఒక్కొక్కటిగా విప్పి చూపిస్తూ పాటల ద్వారా కథలను వివరించేవారు. అందువల్ల ఇది కేవలం చిత్రకళ మాత్రమే కాదు, ఒక దృశ్య కథన సంప్రదాయం కూడ

### తెలంగాణకు గర్వకారణం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రపతి భవన్ వంటి అత్యున్నత జాతీయ వేదికపై నకాష్ కళాకారులకు ఈ స్థాయిలో గుర్తింపు లభించడం చారిత్రాత్మకమని తెలంగాణ రాష్ట్ర నకాష్ సంఘం పేర్కొంది. చేర్యాల కళకు జాతీయ స్థాయిలో మరింత ఆదరణ కల్పించేందుకు ఈ ఘట్టం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నకాష్ సంఘం అధ్యక్షుడు కేశవరావు, అసోసియేట్ అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయం ట్రస్ట్ చైర్మన్ వినోద్ కుమార్ వర్మ కళాకారులను అభినందించారు.

పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన నకాష్ కళను రాష్ట్రపతి భవన్ వరకు తీసుకెళ్లి తెలంగాణ కళా వైభవాన్ని చాటడం ప్రతి నకాష్ కుటుంబానికి గర్వకారణం. ఈ గుర్తింపు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచి, చేర్యాల కళకు మరింత ఆదరణ తీసుకురావాలి అని వారు ఆకాంక్షించారు.









సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 09.10.2026
www.mudranews.in | @mudranews



### పల్లీలు తిన్నాక నీరు తాగాల్సి వస్తే ఇలా చేయండి

పల్లీలు తిన్న వెంటనే నీరు తప్పనిసరిగా తాగాల్సి వస్తే *చల్లటి నీటికి బదులుగా గది ఉష్ణోగ్రతలోని నీటిని* కొద్దిగా తీసుకోవడం మంచిది. గోరువెచ్చని నీటిని కూడా స్వల్ప పరిమాణంలో తీసుకోవచ్చు.



## పోలీస్ యూనిట్ల పనితీరు మెరుగుపర్చితేనే

# జాతీయ స్థాయిలో రాణిస్తాం

### నూతన క్రిమినల్ చట్టాల అమలుపై డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక సమీక్ష



**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 8:** నూతన క్రిమినల్ చట్టాల అమలుతో పాటు నేరాల నియంత్రణ, దర్యాప్తు నాణ్యత, నేర నిర్ధారణ శాతాన్ని పెంచడంలో వెనుకబడిన పోలీస్ యూనిట్లు పనితీరును మెరుగుపర్చుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. పోలీస్ యూనిట్ల పనితీరు మెరుగుపడితేనే జాతీయ స్థాయిలో తెలంగాణ మెరుగైన ర్యాంకు సాధించగలదని అన్నారు. ఈ మేరకు క్రైమ్ ర్యాంకింగ్‌లో వెనుకబడిన యూనిట్ల కమిషనర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో గురువారం సీఐడీ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.నూతన చట్టాల అమలులో వేగం పెంచాలని, జీరో ఎఫ్ఐఆర్, ఈ-సాక్ష్య, ఈ-సమన్లు, న్యాయశృతి, ఆన్‌లైన్ చార్జిషీట్లు, నిర్ణీత గడువులో దర్యాప్తు పూర్తి చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో నమోదవుతున్న సమాచారాన్ని విశ్లేషించి నేర నియంత్రణకు వినియోగించాలని సూచించారు.

**ఆరు అంశాలపై సమీక్ష**

కేసుల పరిష్కారం, లైంగిక నేరాల ట్రాకింగ్, పెండింగ్ కేసుల సత్వర విచారణ, నేరం జరిగిన ప్రాంతంలో ఎఫ్ఐఆర్ నమోదు, ఈ-సాక్ష్య తదితర అంశాలపై యూనిట్ల వారీగా డీజీపీ సమీక్షించారు. ఆయా యూనిట్లలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు.ములుగు జిల్లా నూతన క్రిమినల్ చట్టాల అమలులో ప్రథమ స్థానంలో నిలిచిందని అధికారులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి, రామగుండం కమిషనరేట్లు కూడా పలు అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచాయని పేర్కొన్నారు. మల్కాజిగిరి, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, జీఆర్పీ సికింద్రాబాద్, యాదాద్రి భువనగిరి యూనిట్లు పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని డీజీపీ సూచించారు.

**నాలుగు అంశాల ఆధారంగా ర్యాంకింగ్**

నూతన క్రిమినల్ చట్టాల అమలును జాతీయ స్థాయిలో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్, ఆపరేషనల్ ఎఫిషియెన్సీ, ఐసీటీ అప్లికేషన్, ఇంటిగ్రేషన్ అనే నాలుగు ప్రధాన విభాగాల ఆధారంగా అంచనా వేస్తున్నారు. వీటికి వరుసగా 20, 45, 25, 10 శాతం వెయిటేజీ కేటాయించారు. ఈ ప్రమాణాల ప్రకారం తెలంగాణ 60.15 స్కోర్ సాధించింది.జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్ చార్జిషీట్, ఈ-సాక్ష్య, ఈ-సమన్లు, న్యాయశృతి, ఐసీజేఎస్ వంటి వ్యవస్థలను మరింత సమర్థంగా వినియోగిస్తే రాష్ట్ర ర్యాంకింగ్‌ను మెరుగుపర్చే అవకాశం ఉందని డీజీపీ తెలిపారు.గతంలో ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై నిర్వహించిన సమీక్షల్లో ఇచ్చిన సూచనలను అమలు చేయడం ద్వారా ఆ విభాగాలు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాయని గుర్తుచేశారు. ఇదే విధంగా ఇతర విభాగాలు కూడా లోపాలను గుర్తించి సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.సైబర్ నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరస్థులపై ప్రత్యేక దృష్టి సారించి నేరాల పునరావృతిని అరికట్టాలని ఆదేశించారు. నూతన చట్టాలు, సాంకేతిక వ్యవస్థలపై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు. త్వరలో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యూనిట్ల పనితీరును సమీక్షిస్తామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, ఐజీ మల్టీజోన్-1 చంద్రశేఖర్ రెడ్డి, వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

# 21 సర్కిళ్లలో బస్తీబాట విజయవంతం

### ప్రజల వద్దకే వెళ్లి విద్యుత్ సమస్యల పరిష్కారం







**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 8:** ప్రజల వద్దకే వెళ్లి విద్యుత్ సమస్యలను గుర్తించి, అక్కడికక్కడే పరిష్కరించేందుకు టీజీఎస్పీడీసీఎల్ నిర్వహిస్తున్న 'బస్తీబాట-ప్రజాబాట' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోంది. సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు 21 సర్కిళ్ల పరిధిలో అధికారులు, సిబ్బంది బస్తీలు, గ్రామాలు, కాలనీల్లో విస్తృతంగా నిర్వహణ పనులు చేపడుతున్నారు.విద్యుత్ భద్రత, నాణ్యమైన సరఫరాకు ప్రాధాన్యం ఇస్తూ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, డీటీఆర్ యార్డుల శుభ్రత, చెట్ల కొమ్మలు, క్రీపర్ల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారం, ఎల్‌టీ లైన్లకు స్పేసర్ల ఏర్పాటు, అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టారు.సిద్దిపేట సర్కిల్‌లోని తునికి బొల్లారం గ్రామంలో డీఈ (ఆపరేషన్) ఆధ్వర్యంలో సర్పంచ్, ప్రజలతో సమావేశం నిర్వహించి విద్యుత్ సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టారు. ములుగు ఉపవిభాగంలోనూ గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలను స్వీకరించారు.హైదరాబాద్ మెట్రో జోన్ పరిధిలోని సైదాబాద్, శంకర్‌మఠ్, లంగర్‌హౌస్, అస్మాన్‌గఢ్, లాల్‌బజార్, బైరామల్‌గూడ తదితర ప్రాంతాల్లో డీటీఆర్ యార్డుల శుభ్రత, క్రీపర్ల తొలగింపు, చెట్ల కొమ్మల కత్తిరింపు, ఎల్‌టీ లైన్ స్పేసర్ల ఏర్పాటు, డీటీఆర్ నిర్వహణ పనులు పూర్తి చేశారు.మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణరావుపేట, సూర్యాపేట, నల్గొండ, మోత్కూర్, త్రిపురారం తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారం, సింగిల్‌ఫేజ్ డీటీఆర్‌ల ఛార్జింగ్, సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూసర్వేలు నిర్వహించారు.విద్యుత్ స్తంభాలు, లైన్లు, డీటీఆర్‌ల స్థితిని పరిశీలించడంతో పాటు ప్రమాదాల నివారణ, విద్యుత్ పరికరాల నిర్వహణ, డీటీఆర్‌ల సంరక్షణపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించడమే బస్తీబాట-ప్రజాబాట ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచడం, అంతరాయాలను తగ్గించడం, భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, వినియోగదారుల సంతృప్తిని పెంచడం లక్ష్యంగా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## ఓబీసీ కాలమ్ చేర్చకపోతే జనగణనను బహిష్కరిస్తాం

### డిసెంబర్ 14, 15న పార్లమెంట్ ముట్టడిస్తాం

### ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సులో బీసీ సంఘాలు, అఖిలపక్ష నేతల హెచ్చరిక

**ముద్ర, న్యూఢిల్లీ:** జనగణనలో ఓబీసీ వివరాల కోసం ప్రత్యేక కాలమ్ చేర్చాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 14, 15 తేదీల్లో ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడిస్తామని బీసీ సంఘాలు, అఖిలపక్ష నేతలు ప్రకటించారు. ఓబీసీ వివరాలకు సంబంధించిన అంశాన్ని స్పష్టంగా చేర్చే వరకు కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యం లో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఓబీసీ జాతీయ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. 22 రాష్ట్రాలకు చెందిన ఓబీసీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీల జనాభా, సామాజిక పరిస్థితులపై సమగ్ర గణాంకాలు సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీ వివరాలకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 14, 15న వేలాది మంది బీసీలతో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీల డిమాండ్లను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ బీసీ గణనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర గణాంకాలు లేకపోతే విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ బీసీ కులగణన కోసం జరుగుతున్న ఉద్యమానికి తమ పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపారు. జనగణనకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీహార్ ఎంపీ పప్పు యాదవ్, రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీ వివరాలకు సంబంధించిన అంశంపై స్పష్టత లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం నేత అరుణ్ కుమార్ మాట్లాడుతూ బీసీ కులగణనకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని, బీసీ సంఘాల పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసిన శంకరరావు, మహారాష్ట్ర రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ భవన్‌రావు తైవాడే తదితరులు మాట్లాడుతూ బీసీ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.సమావేశంలో డి. రాజా, కె. రామకృష్ణ, వి. హనుమంతరావు, పప్పు యాదవ్, రాజేష్ షైనీ, యోగేంద్ర యాదవ్, అరుణ్ కుమార్, సాహు, కేసిన శంకరరావు, ఇంద్రజిత్ సింగ్, ఇక్బాల్ హన్సారీతో పాటు 22 రాష్ట్రాలకు చెందిన ఓబీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అక్రమాలకు వ్యతిరేకంగా

# ఇండియా కూటమి నిరసన

### రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద భారీ మార్చ్, ధర్నా







**ముద్ర, రంగారెడ్డి:** ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ, ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్ష ధోరణికి నిరసనగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన మార్చ్, ధర్నా నిర్వహించారు.ఇండియా కూటమి, ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలను పరిశీలించి, ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

## బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**ముద్ర, కూకట్‌పల్లి:** ఈ సంవత్సరం అమావాస్యకు రెండు రోజుల ముందే బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 5:00 గంటల నుండి కూకట్‌పల్లి గ్రామంలోని పలు ప్రాంతాలతో పాటు స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరి బతుకమ్మ ఆడనున్నారు.అక్కడ బతుకమ్మలు ఆడిన అనంతరం, అందరూ కలసి పీఎన్ఎమ్ స్కూల్ గ్రౌండ్‌కు చేరుకుని మళ్లీ బతుకమ్మలు ఆడి, చివరిగా రంగధాముని చెరువు (ఐడిఎల్ చెరువు)లో నిమజ్జనం చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా రంగధాముని చెరువు వద్ద జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. వేడుకలకు విచ్చేసే ఆడపడుచులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్, పోలీస్ శాఖాధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అధికారులకు తగిన దిశానిర్దేశం చేశారు.ఈ నెల 18వ తేదీన (18.10.2026) జరగనున్న 'సద్దుల బతుకమ్మ' (పెద్ద బతుకమ్మ) వేడుకలను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి



**ముద్ర, కూకట్‌పల్లి:** ఓట్ల సవరణ ప్రక్రియ (S.I.R.) పేరుతో జరుగుతున్న అక్రమాలకు నిరసనగా INDIA కూటమి పిలుపునిచ్చిన 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'చలో రాజ్ భవన్' ర్యాలీలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు.
కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ గళాన్ని వినిపించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. S.I.R. పేరుతో ఓట్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు.కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బ్లాక్, డివిజన్ అధ్యక్షులకు, యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్, NSUI నాయకులు మరియు కార్యకర్తలకు బండి రమేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ చేపట్టే ప్రతి పోరాటంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ఆటో డ్రైవర్ నిజాయితీకి ప్రశంసలు





**ముద్ర, కూకట్‌పల్లి:** పోగొట్టుకున్న ఖరీదైన మొబైల్ ఫోన్‌ను తిరిగి యజమానికి అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్న సంఘటన మూసాపేటలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేటకు చెందిన శ్రీమతి అనుగుల శ్రీవిద్య (36) బుధవారం (అక్టోబర్ 07) సాయంత్రం స్థానిక ఆర్.ఎస్. బ్రదర్స్ షాపింగ్ మాల్‌లో పిల్లల దుస్తులు కొనుగోలు చేశారు. రాత్రి సుమారు 9:30 గంటలకు ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించి బయటకు వచ్చిన అనంతరం, సర్వీస్ రోడ్డుపై వెళ్తుండగా ఆమె మొబైల్ ఫోన్ పోయినట్లు గుర్తించారు. వెంటనే ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు సదరు మొబైల్ నంబర్‌కు కాల్ చేయగా, ఇందిరా హిల్స్ రోడ్ నం.3కు చెందిన ఆటో డ్రైవర్ తులసి కృష్ణ (46) ఫోన్ ఎత్తారు. ఆర్.ఎస్. బ్రదర్స్ సమీపంలోని సర్వీస్ రోడ్డుపై ఈ ఫోన్ దొరికిందని ఆయన పోలీసులకు తెలిపారు. అనంతరం పోలీసుల సూచన మేరకు ఆయన వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఫోన్‌ను శ్రీవిద్యకు అప్పగించారు.దొరికిన ఫోన్‌ను తన వద్దే ఉంచుకోకుండా, బాధ్యతాయుతంగా పోలీసులకు అప్పగించి యజమానికి చేర్చిన ఆటో డ్రైవర్ తులసి కృష్ణ నిజాయితీని పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### ఎంపీ ఈటల రాజేందర్

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో 15 ఏళ్లుగా సేవలందిస్తున్న సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి సమస్యలను పరిష్కరించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.డాక్టర్లు, నర్సులు, టెక్నికల్ సిబ్బంది తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పలు రాష్ట్రాల్లో క్రమబద్ధీకరించి శాశ్వత ఉద్యోగులుగా కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణలోనూ దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.ఈ సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 13న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టనున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ కోరారు.

## టీ.జీ.ఓ. మహిళా విభాగం

## బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు టీ.జీ.ఓ. మహిళా విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాల పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన పండుగ అని అన్నారు. మహిళల సాంస్కృతిక ఐక్యతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు టీ.జీ.ఓ. మహిళా విభాగం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో సాంస్కృతిక చైతన్యం, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో టీ.జీ.ఓ. అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ డా. జి. దీపారెడ్డి, కన్వీనర్ జే. సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 09.10.2026
www.mudranews.in | @mudranews



## పల్లీలు : అలర్జీ ఉన్నవారు జాగ్రత్త

కొంతమందికి వేరుశనగల వల్ల తీవ్రమైన **అలర్జీ ప్రతిచర్యలు** వచ్చే అవకాశం ఉంటుంది. పల్లీలు తిన్న తర్వాత దద్దుర్లు, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని తినడం ఆపి వైద్య సహాయం తీసుకోవాలి.



## సిఎంఓ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు

- తప్పు జరిగితే ఉపేక్షించేది లేదన్న ఎంపీడీవో రామ్మోహన్ చారి
- విచారణ నివేదికను సిఎంఓకి పంపిస్తాం.



ముద్ర చిగురుమామిడి: ముదిమాణిక్యం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పచ్చిమట్ల మధుసూదన్ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన గారబోయిన బాలమల్లు సిఎంఓ కి ఫిర్యాదు చేశారు. దీంతో చిగురుమామిడి ఎంపీడీవో రామ్మోహన్ చారి, మండల ఎం పీవో కిరణ్,ఏ పి ఓ రాజు, టీ ఏ, శ్రీనివాస్ లు,ముదిమాణిక్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోయిని రమేష్ సమక్షంలో విచారణ జరిపారు. చిగురుమామిడి మండ లం ముదిమాణిక్యం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్ పై ఫిర్యాదు చేసిన వారిని పంచాయతీ కార్యాలయానికి పిలిచి ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్ ను విచారించారు.విచారణ అనంతరం ఎంపీడీఓ రామ్మోహన్ చారి,అధికారుల బృందం,వచ్చిన పిర్యాదు మీదా పూర్తి విచారణ చేయగా ఎలాంటి అవకతవకలు జరిగినట్టు,ఆధారాలు లేవు,అని వచ్చిన ఆరోపణలో నిజం లేదని వివరణ ఇచ్చారు.విచారణ తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్ మాట్లాడుతు, ప్రతి సంవత్సరం,అడిట్(సామజిక తనిఖీ) లు 16నిర్వహించరు, ఇప్పటి ఎలాంటి ఆరోపణలు రాలేదని,తప్పు జరిగినచో, శాఖ పరమైన చర్యలకు, స్వచ్ఛ0దంగ స్వీకరిస్తాను అన్నారు.ఉపాధి పట్ల విచారణ స్థలం లో ఉన్న కూలీలను సమస్యల పై అడుగ గా పూర్తి అవస్తవం అంటూ అధికారులకు వివరణ ఇచ్చారు. ఈ విచారణ లో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్, ఉపాధి కూలీలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా నాణ్యమైన విద్య



ముద్ర, ధర్మపురి : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలం నేరెళ్లలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించుకుని పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ స్కూల్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన ఇతర సౌకర్యాలను ప్రణాళికాబద్ధంగా, అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## దుర్గాభవానీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు



**ముద్ర, కరీంనగర్ :** నగునూర్ దుర్గాభవానీ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠం, శృంగేరి నుంచి శృంగేరి పీఠాధిపతులు అందించిన పట్టువస్త్రాలు, మంత్ర అక్షింతలను గురువారం అమ్మవారి శోభాయాత్రలో ఊరేగించనున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా ఈ నెల10న అమ్మవారికి సంపూర్ణ అభిషేకం, ధ్వజారోహణం, 11న గోపూజ పుణ్యాహవాచనం, 12న మహేశ్వరి, 13న కౌమారి , 14వ రోజు వైష్ణవి, 15న లలిత త్రిపురసుందరీ దేవి, 16న సరస్వతీదేవి, 17న ఇంద్రాణి, 18న దుర్గాభవానీ, 19న అన్నపూర్ణ, 20న విజయదుర్గ, 21న అర్ధనారీశ్వరీ అలంకరణలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

## దసరా పండుగకు 5,261 ప్రత్యేక బస్సులు

**ముద్ర, అమరావతి:** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దసరా పండుగకు ప్రత్యేక బస్సులు నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ నెల 16 నుంచి 25 వరకు 5,261 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి పొరుగు ప్రాంతాల నుంచి ఏపీలోని వివిధ జిల్లాలకు, ముఖ్యమైన నగరాల మధ్య ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్‌కు 1,186, విశాఖకు 440, బెంగళూరుకు 475, చెన్నైకి 153, తిరుపతికి 247, రాజమహేంద్రవరానికి 347 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం

- **రాష్ట్ర, కేంద్ర వాటాలతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం**
- **లబ్ధిదారుల ఎంపికపై కేంద్ర మార్గదర్శకాల కోసం ఎదురు చూపులు**
- **చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరేలా వ్యవసాయ యాంత్రీకరణ పథకం: మంత్రి తుమ్మల**
- **రైతుకు నచ్చిన కంపెనీ నుంచి వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసే వెసులుబాటు**
- **సబ్సిడీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ**
- **ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం.. బీసీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ**
- **ఎఫ్‌పీఓలను కస్టమ్ హైరింగ్ సెంటర్లుగా వినియోగించే అవకాశాలపై అధ్యయనం చేయాలి: మంత్రి తుమ్మల**
- **రైతుల అభిప్రాయాలతో యాంత్రీకరణ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలి: మంత్రి తుమ్మల**



**ముద్ర, హైదరాబాద్ :** గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పక్కన పెట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2025-26 సంవత్సరం నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేస్తున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు 2026-27 సంవత్సరానికి రూ.147.99 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టామని, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేయాల్సిన మార్గదర్శకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోందని చెప్పారు. కేంద్ర మార్గదర్శకాలు అందిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రైతుకు నచ్చిన కంపెనీ నుంచి పరికరం కొనుగోలు చేసే అవకాశం...**

రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాన్ని తమకు నచ్చిన ఎంప్యానెల్ చేసిన కంపెనీ వద్ద కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం పథకం ద్వారా లబ్ధి పొందే రైతు ఒక నిర్దిష్ట సంస్థ లేదా ఎంపిక చేసిన సరఫరాదారుడి వద్ద నుంచే పరికరం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి లేకుండా, రైతుకు మరింత స్వేచ్ఛ ఉండే విధంగా విధానాన్ని రూపొందించాలని తెలిపారు.

సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయనుండటం వల్ల రైతులు కూడా వ్యవసాయ పరికరం కొనుగోలు చేసే ముందు వివిధ కంపెనీల ధరలను, నాణ్యతను పరిశీలించి, తక్కువ ధరకు మంచి నాణ్యత కలిగిన పరికరం ఎక్కడ లభిస్తే అక్కడే కొనుగోలు చేసుకోవాలని మంత్రి సూచించారు. దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ సద్వినియోగం కావడంతో పాటు, ఎక్కువ మంది రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం, బీసీ మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు. సబ్సిడీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు, పథకంలో పారదర్శకత పెరుగుతుందని మంత్రి అన్నారు.

**37 రకాల వ్యవసాయ పరికరాలు...**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించేందుకు ప్రస్తుతం 37 రకాల వ్యవసాయ పరికరాలను ఖరారు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో పథకం పరిధిలో 19 రకాల పరికరాలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పరికరాల సంఖ్యను 37 రకాలకు పెంచినట్లు చెప్పారు.

ఇందులో పవర్ టిల్లర్, బ్యాటరీ ఆపరేటెడ్ ఎలక్ట్రిక్ టిల్లర్/వీడర్, డిస్క్ ప్లౌ, కల్టివేటర్, లెవలింగ్ బ్లేడ్, రోటావేటర్, రోటో-పుడ్లర్, రివర్సిబుల్ ఎంబీ ప్లౌ, సబ్ సాయిలర్, బండ్ ఫార్మర్, సీడ్-కం-ఫెర్టిలైజర్ డ్రిల్, మల్టీ క్రాప్ ప్లాంటర్, రైజ్డ్ బెడ్ ప్లాంటర్, పోస్ట్ హోల్ డిగ్గర్, ప్లాస్టిక్ మల్చ్ లేయింగ్ మెషిన్, ఫెర్టిలైజర్ బ్రాడ్‌కాస్టర్, రిడ్జ్ ఫరో ప్లాంటర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్లాషర్, పవర్ వీడర్, మాన్యువల్ నాప్‌సాక్ స్ప్రేయర్, పవర్ నాప్‌సాక్ స్ప్రేయర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్, కిసాన్ డ్రోన్, కంబైన్ హార్వెస్టర్, మైజ్ కంబైన్ హార్వెస్టర్, మల్టీ క్రాప్ థ్రెషర్, విన్నోయింగ్ ఫ్యాన్, మైజ్ షెల్లర్, టెలిస్కోపిక్ హార్వెస్టింగ్ పోల్స్, పసుపు బాయిలర్, పసుపు పాలిషర్, ప్యాడీ మొబైల్ డ్రైయర్, స్ట్రా బేలర్, రోటరీ ష్రెడర్, మల్చర్, రోటరీ స్ట్రా స్లాషర్, బ్రష్ కట్టర్ ఉన్నాయి.

రైతుల అవసరాలు, సాగు విధానాల్లో వస్తున్న మార్పులు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని పథకం అమలు మధ్యలో కూడా రైతులకు ఉపయోగపడే కొత్త వ్యవసాయ పరికరాలను చేర్చుకునేలా విధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**యాంత్రీకరణలో ఎఫ్‌పీఓలకు కీలక పాత్ర...**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను (ఎఫ్‌పీఓలను) భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ఎఫ్‌పీఓల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని, వాటిని పథకం అమలులో ఎలా ఉపయోగించుకోవచ్చో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులు ప్రతి వ్యవసాయ పరికరాన్ని సొంతంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వ్యవసాయ పరికరాలను రైతులకు అద్దెకు అందించే అవకాశాన్ని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఒక్క రైతు ఖరీదైన యంత్రాన్ని కొనుగోలు చేయడం కంటే, ఒక ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో పరికరాలను అందుబాటులో ఉంచి అవసరమైన సమయంలో రైతులకు అద్దెకు అందిస్తే, తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది రైతులు యాంత్రీకరణ ప్రయోజనాలను పొందే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు.

**రైతుల అభిప్రాయాలనూ సేకరించాలి..**

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు రైతుల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని మంత్రి తుమ్మల తెలిపారు. వచ్చే మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ఎఫ్‌పీఓల ప్రతినిధులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు.

రైతుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి తుది రూపం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## ఓటు చోరీ ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు

**ముద్ర, హైదరాబాద్ :** 'ఓటు చోరీ' ఆరోపణలపై సమాధానం కోరుతున్న ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఓటర్ల జాబితాలపై లేవనెత్తిన ప్రశ్నలకు బారికేడ్లు, అరెస్టులు సమాధానం కాద న్నారు. ఢిల్లీలో అక్టోబర్ 6, 7 తేదీల్లో జరిగిన నిరసనల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ప్రతిపక్ష ఎంపీలను పోలీసు లు అదుపులోకి తీసుకోవడాన్ని ఉత్తమ్ ఖండించారు. ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం, ప్రియాం క గాంధీ చూపిన ధైర్యం ప్రజాస్వామ్య పరిరక్షణకు స్ఫూర్తిదాయకమన్నారు.

ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు, చేర్పులకు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘం ఆధారాలతో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట ఆరోపణలపై స్వతంత్ర, నిష్పక్షపాత విచార ణ జరగాలని కోరారు. ఎన్నికల సంఘంపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఆ సంస్థపైనే ఉందని పేర్కొన్న ఉత్తమ్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రతిపక్ష డిమాండ్ కు మద్దతు తెలిపారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజల సందేహాలను తొలగించలేరని స్పష్టం చేశారు.

## మైక్రోసాఫ్ట్ సహా 8 టెక్ కంపెనీలకు అమెరికా షాక్

**ముద్ర, ముంబై :** ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలకు అమెరికా షాక్ ఇచ్చింది. అంత ర్జాతీయంగా పేరొందిన ఎనిమిది ఐటీ కంపెనీల శాశ్వత కార్మిక సర్టిఫికేషన్‌ను సస్పెండు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, కాగ్ని జెంట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. దీంతో ఆయా సంస్థల తరఫున హెచ్-1బీ వీసాపై అమెరికాకు వచ్చే ఉద్యోగులు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం కుదరదు. వీసా కార్య క్రమం దుర్వినియోగం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఉపాధ్య క్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు.

## భారత్ గ్రోత్ జర్నీలో ఏపీ పాత్ర కీలకం: పీయూష్ గోయెల్

**ముద్ర, అమరావతి:** సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీయూష్ గోయెల్ తెలుగులో మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అమరావతిని పాలించిన శాతవాహనుల కాలంలోనే నౌకా వాణిజ్యం ద్వారా ఆంధ్ర ప్రాంతం ప్రపంచంతో అనుసంధానమైందని ఆయన గుర్తుచేశారు. శాతవాహనుల నాణేల్లోని నౌక గుర్తు అప్పటి వాణిజ్య విస్తృతికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రస్తుతం కూడా ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా మారుతోందని చెప్పారు. చంద్రబాబు విజనరీ నాయకత్వంలో ఏపీ టెక్నాలజీ రంగంలో ముందంజలో ఉందని పీయూష్ పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి ఊతమిస్తున్నాయని తెలిపారు. కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను ఏపీ సమర్థంగా వినియోగించుకుంటోందన్నారు. టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్, టాలెంట్, ట్రెడిషన్ అనే ఐదు అంశాలపై దృష్టి సారించాలని సూచించిన పీయూష్, పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని ఏపీ చూరగొంటోందన్నారు. భారత్ గ్రోత్ జర్నీలో ఏపీ పాత్ర అత్యంత కీలకమని, విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలు హాజరై పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానాన్ని ప్రస్తావించిన పీయూష్.. దేశాన్ని ఆర్థికంగా, రక్షణపరంగా బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జీఎస్టీ, జన్‌ధన్, డిజిటల్ కనెక్టివిటీ వంటి సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేశాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటారని పీయూష్ గోయెల్ అన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థల అధ్యయనంతో అవగాహన



**ముద్ర, హైదరాబాద్ :** ప్రపంచంలోని వివిధ దేశాల ప్రజాస్వామ్య వ్యవస్థలు, పార్లమెంటరీ విధానాలను అధ్యయనం చేయడం ద్వారా శాసనసభల పనితీరు, పారదర్శకత, జవాబుదారీతనంపై మరింత అవగాహన పెంపొందించుకోవచ్చని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (CPA) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం గురువారం స్విట్జర్లాండ్ రాజధాని బెర్న్‌లోని చారిత్రాత్మక పార్లమెంట్ భవనాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్విట్జర్లాండ్ పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, శాసనసభల పనితీరు, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలను రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం, ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు.

ప్రపంచంలోని వివిధ దేశాల పార్లమెంటరీ విధానాలను పరిశీలించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు, శాసనసభల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై విలువైన అనుభవం లభిస్తుందని తెలిపారు. స్విట్జర్లాండ్ ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానాలకు ప్రత్యేక గుర్తింపు పొందిందని, ప్రజల భాగస్వామ్యానికి అక్కడ ఇస్తున్న ప్రాధాన్యం అధ్యయనం చేయదగినదని అన్నారు.

అంతర్జాతీయ అధ్యయన పర్యటనల ద్వారా లభించే అనుభవాలను తెలంగాణ శాసన వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దేందుకు వినియోగించుకోవచ్చని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ పర్యటనలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి సెక్రటరీ డా. నరసింహాచార్యులు, శాసన సభ స్పీకర్ ఓఎస్డీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 09.10.2026
www.mudranews.in | @mudranews



## పల్లీలు తిన్నాక వెంటనే నీళ్లు తాగొద్దు



పల్లీలు తిన్న వెంటనే నీళ్లు తాగకుండా కనీసం 10–15 నిమిషాలు వేచి ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చల్లటి నీటిని వెంటనే తీసుకోవడం మానుకోవాలి.

## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్‌డేను పురస్కరించుకొని తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్‌ఫిల్మ్ మేకర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పోలీసుల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రజా భద్రత, పోలీస్–ప్రజల సంబంధాలు, విధి నిర్వహణ తదితర అంశాలను ప్రతిబింబించేలా పోటీ ఎంట్రీలు ఉండాలని ఎస్పీ సూచించారు. 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు తీసిన మూడు ఫోటోలను, మూడు నిమిషాల నిడివి మించని షార్ట్‌ఫిల్మ్‌లను పోటీలకు పంపించవచ్చని సూచించారు.జిల్లా స్థాయిలో అందిన ఎంట్రీల నుంచి ఉత్తమ మూడు ఫోటోలు, మూడు షార్ట్‌ఫిల్మ్‌లను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీలోపు మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీఆర్‌ఓ సెక్షన్‌లో అందజేయాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 25న మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. పోలీసుల సేవలు, విధి నిర్వహణ, ప్రజా భద్రతను ప్రతిబింబించే మంచి ఫోటోలు, షార్ట్‌ఫిల్మ్‌లను రూపొందించి పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు పీఆర్‌ఓ: 8712529742 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** క్షయ వ్యాధి నిర్మూలనకు అందరం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఓ)రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. గురువారం టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 2030 నాటికి దేశంలో టి.బి.(క్షయవ్యాధి)ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టి.బి. ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే 13 టి.బి. ముక్త్ గ్రామ పంచాయతీలను గుర్తించడం జరిగిందని తెలిపారు. టి.బి. వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధి అని, దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 215 యాక్టివ్ టి.బి. కేసులు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్.సి.సి., మై భారత్ క్యాడెట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం



**ముద్ర, కూకట్‌పల్లి :** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలో శిక్షణ (కోచింగ్) కోసం వచ్చిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన మీసాల షణ్ముఖ రావు (22) అనే యువకుడు కనిపించకుండా పోవడంతో అతని తండ్రి పోలీసులను ఆశ్రయించారు. శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, పెద్ద రొంపివలస గ్రామానికి చెందిన షణ్ముఖ రావు 2026 ఫిబ్రవరి 2న కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ విఘ్నేశ్వర హాస్టల్‌లో చేరి కోచింగ్ తీసుకుంటున్నట్లు చెప్పాడు. జూలైలో అనుమానం వచ్చిన తండ్రి హాస్టల్‌కు వచ్చి విచారించగా, అక్కడ లేడని, హాస్టల్ ఖాళీ చేసి వెళ్లాడని తెలిసింది.అనంతరం, ఫోన్ చేసి తాను క్షేమంగా ఉన్నానని, ఆందోళన చెందవద్దని చెప్పడంతో తండ్రి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కాగా, ప్రస్తుతం అతను ఇంటికి రాకుండా రకరకాల సాకులు చెబుతూ ఫోన్ మాత్రమే చేస్తుండటం, తన పూర్తి వివరాలు తెలపకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి ఫిర్యాదు చేశారు. యువకుని వాట్సాప్ ప్రస్తుతం యాక్టివ్‌గానే ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యావకాశాలు

### కలెక్టర్ ప్రతిమా సింగ్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్య అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రుల సమావేశం మెదక్‌లోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలను అందిస్తోందని తెలిపారు. అలింకో క్యాంపుల ద్వారా అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నామని, అలాగే ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ వంటి సహాయాలను అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 21 భవిత కేంద్రాల్లో 194 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. సాధారణ పాఠశాలకు వెళ్లలేని పిల్లలకు భవిత కేంద్రాల్లో అవసరమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఐఈఆర్పీలు వారికి విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు.భవిత కేంద్రానికి కూడా రాలేని పిల్లల కోసం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా వారి ఇళ్లకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 63 మంది పిల్లలకు ఈ విధంగా విద్య అందిస్తున్నట్లు చెప్పారు.భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వారిలో ఇప్పటివరకు 46 మంది పిల్లలను తిరిగి సాధారణ పాఠశాలల్లోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వహణకు గత సంవత్సరం ప్రభుత్వం రూ.1.06 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో జిల్లాలోని భవిత కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఎఎంఓ సుదర్శన్ మూర్తి , సీఎంఓ రాజు, ఏఎస్‌ఓ నవీన్, మురళీమోహన్, ఎంఈఓ శంకర్, జిల్లాలోని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలోకి బీజేపీ నేత

### ఖానాపూర్‌కు చెందిన పలువురు సర్పంచుల చేరిక



**ముద్ర, హైదరాబాద్:** నిర్మల్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సుంచు ఎల్లయ్యతో పాటు ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.సర్పంచులు టేకం లక్ష్మణ్, గడ్డం భీముడు, కె. రాజేందర్, కస్తూరి అర్జున్, శ్రీపెల్లి శేఖర్, ఉప సర్పంచులు పి. రాజు, చింటు కాంతి, గంపల భూమన్న, మాజీ ఎంపీటీసీలు రామ్‌సింగ్, షిండే సదాశివ, మాజీ సర్పంచులు తదితరులు పార్టీలో చేరారు. నిర్మల్ జిల్లా, ఖానాపూర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని కవిత సూచించారు. ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని కోరారు.

# సరుకు రవాణా బలోపేతానికి.. ఐఐఎం బెంగళూరుతో దక్షిణ మధ్య రైల్వే భాగస్వామ్యం

### రైల్ బిజినెస్ కాంక్లేవ్‌లో పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు

**ముద్ర, హైదరాబాద్:**సరుకు రవాణాను మరింత బలోపేతం చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే, ఐఐఎం బెంగళూరుతో కలిసి నిర్వహిస్తున్న అధ్యయనంలో భాగంగా 'రైల్ బిజినెస్ కాంక్లేవ్' నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సిమెంట్, బొగ్గు, ఉక్కు, వ్యవసాయ ఉత్పత్తులు, ఆటోమొబైల్స్, పోర్టులు, కంటైనర్ రంగాల్లో రైలు రవాణాను పెంచే అవకాశాలపై పరిశ్రమ ప్రతినిధులతో చర్చించారు. ఐఐఎం బెంగళూరు ఆరు నెలలకు పైగా నిర్వహించిన క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త ఫ్రైట్ టెర్మినల్స్, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పోర్టులు, పరిశ్రమలకు మెరుగైన రైలు అనుసంధానం తదితర అంశాలపై సూచనలు రూపొందించింది.ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. 2030 నాటికి భారతీయ రైల్వే 3,000 మిలియన్ టన్నుల సరుకును లోడ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దక్షిణ మధ్య, దక్షిణ కోస్తా రైల్వేలు కలిసి 264 మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని సాధించాల్సి ఉందన్నారు. పరిశ్రమలు, భాగస్వాములు సూచించిన సమస్యలను పరిష్కరించి సరుకు రవాణా వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, ఐఐఎం ప్రతినిధులు, సిమెంట్ పరిశ్రమలు, సింగరేణి, థర్మల్ పవర్ స్టేషన్లు, పోర్టులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, వేర్‌హౌసింగ్, కార్గో, కంటైనర్ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రీమ్ వ్యూ కాలనీలో తీరిన డ్రైనేజీ కష్టాలు



**ముద్ర , కూకట్‌పల్లి:**కూకట్‌పల్లి నియోజకవర్గంలోని డ్రీమ్ వ్యూ కాలనీలో ఏళ్ల తరబడి వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సంబంధిత అధికారులతో చర్చించి పనులను మంజూరు చేయించారు. ఇందులో భాగంగా గురువారం డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. కాలనీవాసులు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారుల సహకారంతో పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కిల్లారు శ్రీనివాస బాబు, కాలనీ ప్రెసిడెంట్ తాకినేని రవికుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాకినేని వినోద్ కుమార్, రామారావు, కోటారి వెంకట్, కొల్లి సత్యనారాయణ తదితరులతో పాటు జీహెచ్ఎంసీ డీజీఎం త్రినాథరావు, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ మమత పాల్గొన్నారు. దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన బండి రమేష్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

# జేఎన్‌టీయూహెచ్ వీసీపై పోలీసులకు ఫిర్యాదు

### మహిళా అధ్యాపకుల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు, దాడి యత్నం ఆరోపణలు




**ముద్ర, కూకట్‌పల్లి :**జవాహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డిపై వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మహిళా అధ్యాపకులు కూకట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళితే, వీజేఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన మరియు కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి తడాక్టర్ అరుణ కుమారితో పాటు పలువురు మహిళా అధ్యాపకులు వీసీ కిషన్ రెడ్డిని కలిసేందుకు వెళ్లారు. ఆ సమయంలో వీసీ తమ పట్ల తీవ్ర అవమానకరంగా మరియు లింగ వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉండకూడదని, కేవలం గృహిణులుగా మాత్రమే పరిమితం కావాలంటూ అభ్యంతరకర రీతిలో మాట్లాడినట్లు వారు ఆరోపించారు.అంతేకాకుండా, తాము అందజేసిన ఆహ్వాన పత్రాన్ని వీసీ చింపివేసి, గెట్ అవుట్ అంటూ తీవ్ర పదజాలంతో దూషించారని బాధితులు తెలిపారు. అక్కడితో ఆగకుండా భౌతిక దాడికి యత్నిస్తూ బెదిరింపులకు దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థకు అధిపతిగా ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి ప్రవర్తన రావడం అత్యంత విచారకరమని, ఆయనపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.

## ఆత్మ కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి ఇటీవలనే ఎంపిక కాగా, గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. కాగా కమిటీలో చైర్మన్ తో 29 డైరెక్టర్లకు సంబంధించి వివరాలను చైర్మన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చుక్క స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్, మైనార్టీ సెల్ నాయకులు షానూర్ బాబా, మండల నాయకులు శెట్టి యాదగిరి, మన్నె వారు పంపు గ్రామ శాఖ అధ్యక్షుడు రాంబాబు, గుంతకండ్ల సురేష్‌లు పాల్గొన్నారు.

## ఎంపీ వాయిస్ మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి వాయిస్ మార్ఫింగ్ (ఏఐ ద్వారా గొంతు మార్ఫ్ ) చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం పై తప్పుగా మాట్లాడినట్లు సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న డిగ్ టీవీ పారడి అనే చానెల్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్‌కు గురువారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ ప్రధానకార్యదర్శి పొత్నాక్ ప్రమోద్ కుమార్, పీసీసీ డెలిగేట్ మెంబెర్ తంగేళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ కౌన్సిల్లర్లు కుక్కదువ్వు సోమయ్య, బెండెలాల్ రాజ్, షఫీక్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హే రే కార్ శ్రీను పల్లెర్ల యాదగిరి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల బాలరాజ్, సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షులు సామల రవీందర్,కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అతహర్, రాము, మచ్చ రాజు యాదవ్, శరత్, నేహాల్ పాల్గొన్నారు.

## బొమ్మాయిపల్లి గ్రామంలో విత్తనాల పంపిణీ

### సీఎస్ఐఆర్-సీసీఎంబీ శాస్త్రవేత్తల సమావేశం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మాయిపల్లిలోని సీసీఎంబీ అనెక్స్–III కేంద్రంలో హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ ( సి.ఎస్.ఐ.ఆర్– సీసీఎంబి ) ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల సమావేశం, విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా రైతులు, 100 మందికి పైగా సీసీఎంబీ శాస్త్రవేత్తలు, పరిపాలనా సిబ్బంది మరియు అధికారులు పాల్గొన్నారు.శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన అధిక దిగుబడినిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకునే పంట రకాలను రైతులకు పరిచయం చేసి, వాటి సాగును ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమానికి సీఎస్ఐఆర్–సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె. నందికూరి, అదనపు కలెక్టర్ ఎ. భాస్కర్ రావు, వ్యవసాయ అధికారి రమణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ /ఆర్ఓ ఉపేందర్ రెడ్డి, బొమ్మాయిపల్లి కౌన్సిలర్ జి. శ్రీవాణి, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ హితేంద్ర కె. పటేల్, ఇంజనీర్ దేవిదాస్ నిఖార్, సి. శ్యామ్ సుందర్, డాక్టర్ మహమ్మద్ ఇద్రిస్ హాజరయ్యారు.

## ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**జాతీయ ఆరోగ్య మిషన్ ( ఎన్ హెచ్ ఎం ) ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం డి ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారంరాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 13న నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్‌కు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు డాక్టర్ షాహిద్ అలీ, నెహ్రు, నర్సింహా, శ్రీనివాస్, మురళి, వినోద్, లావణ్య, గీత, భవాని, సుమలత పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో జోష్ టీం ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జోష్ టీంను జిల్లా అధికారుల సముదాయంలో గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మనోహర్, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ,డి ఐ ఓ రామకృష్ణ, ముఖ్య అతిథిగా భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ , జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు, జడ్పీ సీఈఓ శోభారాణి, టీబీ ముక్త్ గ్రామాల సర్పంచులు, అధికారులు, జిల్లా ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్షయ్ మిత్ర పిలుపు మేరకు నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నందుకు యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్ నీ ముఖ్య అతిథులు శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

## పేకాట స్థావరంపై దాడి పోలీసుల అదుపులో 13 మంది

**ముద్ర, యాదగిరిగుట్ట:**యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీరామ్ నగర్ లోని ఒక ఇంటిలో పేకాట స్థావరంపై గురువారం దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. పోలీసుల సమాచారం ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం వచ్చిందని, వెంటనే తమ సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న 13 మందిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించామని తెలిపారు. ఆ సమయంలో వారి వద్ద నుండి రూ.25725 నగదు, 3 ప్లేయింగ్ కార్డ్స్ సెట్లు, 11 మొబైల్ ఫోన్ లు, ఆటకు ఉపయోగించిన 35,300/– ఆన్లైన్ ట్రాన్సక్షన్స్ స్వాధీనపరుచుకున్నట్లు పేర్కొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555